ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 20 జూలై 2024

సూర్యప్రభ వాహనంపై సౌమ్యనాథుడు



సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు

నందలూరు, జూలై 19: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం ఉదయం కూర్మాలంకారంలో సౌమ్యనాథస్వామి సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం, సాయంత్రం ఊంజల్ సేవ కార్యక్రమాన్ని అర్చకులు సునీల్ బృందం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఆలయానికి ఎదురుగా సౌమ్యనాథ అన్నదాన ట్రస్టులో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు గంటా వాసు, దేవయ్య, పల్లె సుబ్రమణ్యం, చక్రాల రామసుబ్బన్న, జంగంశెట్టి సుబ్బయ్య, మోడపోతుల రాము, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవం, రాత్రికి గజవాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.




సౌమ్యనాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోతున్నారు. కొందరు రెవెన్యూ అధికారుల సాయంతో ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకోవడం.. యథేచ్ఛగా ఆక్రమించి దుక్కులు దున్ని పంట పొలాలుగా మార్చేయడం కబ్జాదారులకు పరిపాటిగా మారింది. అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇలాంటిదే ఒంటిమిట్ట మండలంలో చోటుచేసుకుంది. ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న ఓ హోంగార్డు కుటుంబీకులు గత ప్రభుత్వ హయాంలో వంద ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని స్వాహా చేశారు. అంతేనా.. ఆ భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేసి సొంత ఎస్టేట్‌లా గేటు కూడా ఏర్పాటు చేశారు. ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.10 కోట్లు ఉంటుందని అంచనా. గత ప్రభుత్వంలో దీనిపై ఫిర్యాదులు వచ్చినా బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం కూటమి నేతలు కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో దీనిపై విచారణకు ఆదేశించారు. ఇది ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.



భూబకాసురులు

- వైసీపీ అండతో గతంలో ఓ హోంగార్డు కుటుంబీకులు వంద ఎకరాలు స్వాహా
- రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి చుట్టూ సోలార్ ఫెన్సింగ్
- 3 ట్రాన్స్‌ఫార్మర్లు, 4 బోర్లు ఏర్పాటు
- దర్జాగా నాటిన మామిడి, నిమ్మచెట్లు
- సొంత ఎస్టేట్‌లా గేట్ ఏర్పాటు
- కూటమి నేతల ఫిర్యాదుతో విచారణకు ఆదేశించిన కలెక్టర్



ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామంలో ఓ హోంగార్డు ఆక్రమించిన ప్రభుత్వ భూమి

రాజంపేట, జూలై 19: ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు రెవెన్యూ గ్రామంలో వైసీపీ హయాంలో ఓ హోంగార్డు కుటుంబీకులు ఏకంగా వంద ఎకరాల భూఆక్రమణ చేసిన వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. భూమిలేని షెడ్యూల్ కులాల తెగలకు ఇచ్చిన భూములను తక్కువ రేటుతో కొనుగోలు చేసి ఆ భూమికి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వానికి సంబంధించిన సుమారు 70 ఎకరాల డీకేటీ భూమిని ఆక్రమించి అందులో నిమ్మ, మామిడి చెట్లను నాటి ఎంచక్కా సాగు చేసుకోవడం పెద్ద చర్చనీయాంశమైంది.

మండలంలోని పెన్నపేరూరు రెవెన్యూ గ్రామ పొలం సర్వేనంబరు 661లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గత ప్రభుత్వం షెడ్యూలు, కులాలు, తెగల జీవనభృతి కోసం షెడ్యూలు తెగలకు సంబంధించి 20 మందికి, పేదలకు మరో 20 మందికి ఒక్కొక్కరికి ఒకటిన్నర ఎకరా చొప్పున ఇచ్చారు. వారు ఆ భూమిని సాగు చేసుకొనేందుకు ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో భూమిని సాగు చేయకుండా వదిలేశారు. ఇదే అదునుగా భావించి ఆ మండలానికి సంబంధించిన ఓ హోంగార్డు, ఎర్రచందనం స్మగ్లింగ్‌లో గతంలో బాగా పేరుగడించి అటవీశాఖలో గతంలో ఔట్‌సోర్సింగ్‌గా పనిచేసిన అతని సోదరుడు ఇరువురు కలిసి మొత్తం ఆ ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. అందులో 30 ఎకరాల భూమిని నిరుపేదల షెడ్యూలు కులాల వారి ద్వారా తక్కువ రేటుతో కొని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమి సుమారు 70 ఎకరాల పైబడి కబ్జా చేశారు. గత వైసీపీ అధికార పార్టీ నేతల అండతో ఈ భూమిని కబ్జా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ఏకంగా నాలుగు మోటార్లు, 3 ట్రాన్స్‌ఫార్మర్లు, కబ్జా చేసిన భూమికి కంచె, ఓ పెద్ద గేటు, చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాహా చేసుకొని దర్జాగా వ్యవసాయం చేస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ఒక హోంగార్డు కుటుంబం ఇంత భూ ఆక్రమణకు పాల్పడుతుంటే పట్టించుకునే నాథుడే లేరా అంటూ విమర్శలు ఉన్నాయి. ఈ భూమి ప్రస్తుతం రూ.10 కోట్లు విలువ చేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చుట్టుపక్కల రైతులు దీనిపై ఫిర్యాదు చేయడంతో అప్పటి తహసీల్దారు ఒకసారి ఈ ఆక్రమణ భూమిని పరిశీలించి భూమి చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించేశారు. అయితే గత వైసీపీ పాలకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆక్రమణ భూమికి తిరిగి కంచెను ఏర్పాటు చేశారు. ఇక చేసేది లేక రెవెన్యూ అధికారులు సైలెంట్ అయిపోయారు. దీనిని ఆసరాగా చేసుకుని కబ్జాదారులు తిరిగి భూమికి కంచె వేసి నిమ్మచెట్లు నాటి ఎంచక్కా ప్రభుత్వ భూమిలో దర్జాగా వ్యవసాయం చేసుకుంటున్నారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో టీడీపీ నాయకులు ఈ విషయమై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో భాగంగానే సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో ఒంటిమిట్ట తహసీల్దారు రమేష్‌బాబు ఆధ్వర్యంలో సర్వేయర్ వేణుగోపాల్, ఆర్ఐ వెంకటరమణ, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది దీనిపై విచారణ చేపట్టారు.

ఈ విషయమై తహసీల్దారు రమేష్‌బాబును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఈ భూకబ్జాపై కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారని, ఆయన ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని, నిజానిజాలు నిగ్గుతేల్చి కలెక్టర్‌కు నివేదిస్తామని వివరించారు.



ప్రభుత్వ భూమికి కంచెతో పాటు గేటును ఏర్పాటు చేసిన దృశ్యం



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమిత భూమిలో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే పట్టించుకోరా..



వైసీపీ నేతల అండ చూసుకుని ప్రభుత్వ సంస్థలో పనిచేసే ఓ హోంగార్డు తమ కుటుంబీకుల పేరిట ఏకంగా వంద ఎకరాల భూమి కబ్జా చేస్తే అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఏ ఆధారం లేని షెడ్యూల్డు కులాలు, తెగలకు ఇచ్చిన భూములను తక్కువ రేటుతో కొనుగోలు చేసి దాని చాటున చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

- గజ్జల నరసింహారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు, ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోనే 700 ఎకరాలు భూకబ్జా..



ఒక్క ఒంటిమిట్ట మండలంలోనే 700 ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారు. ఈ కబ్జా చేసిన భూమిని అధికారులు తిరిగి స్వాధీనం చేసుకోవాలి. నిరుపేదలైన అన్ని వర్గాల వారికి పంపిణీ చేయాలి. మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఒంటిమిట్ట

అధికారులు స్పందించకపోతే ఆందోళన చేస్తాం..



వైసీపీ నాయకులు ఆక్రమించిన భూములపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ఈ భూములను ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద ప్రజలకు పంపిణీ చేయాలి. లేదంటే ఆందోళన నిర్వహిస్తాం.

- జి.మౌలాలి, మైనార్టీ నాయకుడు

పాల బిల్లులు చెల్లించాలి

- అమూల్ పాల డెయిరీ ఎదుట రైతుల ఆందోళన



డెయిరీ సిబ్బందితో వాదనకు దిగుతున్న పాడిరైతులు

మదనపల్లె, జూలై 19: సకాలంలో పాలబిల్లులు చెల్లించకుండా వివిధ కారణాలతో తిప్పుకుంటుండడంతో పాడిరైతులు నిరసన తెలిపిన సంఘటన చిప్పిలి సమీపంలోని అమూల్ పాలడెయిరీ ఎదుట శుక్రవారం చోటుచేసుకుంది. కురబలకోటం మండలం గవునివారిపల్లెకు చెందిన పాడిరైతులు స్థానికంగా ఉన్న అమూల్ పాలడైయిరీ సంఘంలో గత కొన్నేళ్లుగా పాలు పోస్తున్నారు. కాగా నెలరోజులుగా 27 మంది రైతులకు సంబంధించి రూ.3లక్షలకు పైగా మూడు కంతుల బిల్లులు చెల్లించకుండా తిప్పుకుంటున్నారని బాధితులు వాపోయారు. ఆ సంఘంలో పనిచేస్తున్న రూట్ సూపర్‌వైజర్.. రైతులకు ఇచ్చే పశువుల దాణా అమ్మేసినట్లు ఆరోపిస్తున్నారు. అయితే నిందితుని నుంచి రూ.25 వేలు సొమ్మును రికవరీ చేయడంతో పాటు అతన్ని విధుల నుంచి తొలగించినట్లు తెలిసింది. దీంతోనే బిల్లులు చెల్లింపులో ఆలస్యమైందని డెయిరీ ఉద్యోగులు చెబుతున్నారు. అలాగే పాల క్వాలిటీ శాతం తక్కువగా ఉండడంతో రూ.26 వేల వ్యత్యాసాన్ని కూడా రైతులే చెల్లించినట్లు ఈ సందర్భంగా వాపోయారు. నెలరోజులుగా ఈ రెండు కారణాలు చూపుతూ బిల్లులు చెల్లించకుండా ఆలస్యం చేశారని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. సూపర్‌వైజర్ అక్రమాలు చేస్తుంటే కంపెనీ మేనేజర్లు ఏం చేస్తున్నారని, దానికి రైతులను ఇబ్బందులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. తమకు ఇప్పటికిప్పుడే బిల్లులు మంజూరు చేయాలని భీష్మించి కూర్చున్నారు. దీంతో డెయిరీ మేనేజర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ అన్ని సంఘాలకు సకాలంలో బిల్లులు చెల్లించామని, సాంకేతిక సమస్యలను అధిగమించి పెండింగ్‌లో ఉన్న సంఘాలకు కూడా రెండురోజుల్లో లేదా అవకాశం ఉంటే సాయంత్రానికే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఇందులో గవునివారిపల్లెకు చెందిన 15 మంది రైతులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో వైవీయూ అభివృద్ధి

- ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కృష్ణారెడ్డి



కడప (ఎడ్యుకేషన్), జూలై 19: అందరి సహకారంతో యూనివర్శిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వైవీయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ ప్రారంభం నుంచి వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా ప్రతి విభాగంపై సమగ్ర అవగాహన ఉందన్నారు. యూనివర్శిటీని త్వరితగతిన పురోభివృద్ధి దిశగా తీసుకువెళతామన్నారు. కాగా.. ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డికి వివిధ విభాగాల అధిపతులు శుభాకాంక్షలు తెలిపారు.

నేను మీ సేవకుడిని : మంత్రి మండిపల్లి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై 19: 'నేను మంత్రిని కాదు.. మీ సేవకుడిని' అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు తాను ఒక ఎమ్మెల్యేగా, ఒక మంత్రిగా కాకుండా ఒక ప్రజా సేవకుడిలా పనిచేస్తానని చెప్పుకొచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. ప్రజలను జిల్లా కేంద్రం పేరుతో ఆయన అపోహలు సృష్టిస్తున్నారని, తాను ఏదో జిల్లాను తెచ్చినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారని, జిల్లా కేంద్రానికి అనువైన కేంద్రం కావడంతోనే రాయచోటిని అన్నమయ్య జిల్లాగా ప్రకటించారు తప్ప ఇందులో గత పాలకుల గొప్పేమీ లేదన్నారు. మీడియా సమావేశాలు పెట్టి 33 జిల్లాలు అవుతాయని, రాయచోటి ఉండదంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రాయచోటి నియోజకవర్గ ప్రజల మీద అక్కసుతోనే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారు తప్ప ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తమ సొంత గడ్డపై మంత్రి హోదాలో సమావేశానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, తమ కుటుంబాన్ని ఈ ప్రాంత ప్రజలు ఐదుసార్లు ఆశీర్వదించారని రాయచోటి పట్టణంతో పాటు ఈ ఆరు మండలాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చంద్రబాబునాయుడును ఒప్పించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని మార్చినా అభివృద్ధి ప్రదాత చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన మొదటి నెలలోనే 1వ తేదీన 60 లక్షల మంది లబ్ధిదారులకు 6 గంటల వ్యవధిలో రూ.4 వేల కోట్లు పింఛన్లు పంపిణీ చేసి దేశంలోనే చరిత్ర సృష్టించారని ఆయన కొనియాడారు. ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా 120 అన్నా క్యాంటీన్లను ప్రారంభించి పేదలకు అన్నం పెట్టాలన్న దృఢ సంకల్పంతో తమ ప్రభుత్వం ఉందంటూ చెప్పుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమను తేలేదని, ప్రజలు సైతం ఈ దౌర్జన్యాలు, దోపిడీలను భరించలేక వలసలు పోయే పరిస్థితికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎన్డీఏ కొలువుదీరిన వేళ ఈ రాష్ట్ర ప్రజలకు నిజమైన పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వం భూములు దోచుకునేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొస్తే మొన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారని గుర్తు చేశారు. అతి త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు.

విశ్లేషణాత్మకంగా చదువుకుంటేనే ప్రయోజనం

- విద్యార్థులతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి
- పీలేరు కోటపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

పీలేరు, జూలై 19: బట్టీ విధానంలో కాకుండా విశ్లేషణాత్మకంగా చదువుకుంటేనే పాఠ్యాంశాలు కలకలం గుర్తుంటాయని, భవిష్యత్తు బాగుంటుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి విద్యార్థులకు సూచించారు. పీలేరులోని కోటపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను పరీక్షల దృష్టిలో మాత్రమే చదువుకోకుండా పరిసరాలను పరిశీలిస్తూ చదువుకున్న అంశాలను వాటికి అన్వయించుకోవాలన్నారు. అప్పుడే పుస్తకాల్లోని అంశాలు జీవితాంతం గుర్తుంటాయన్నారు. అంతకుముందు ఆయన పాఠశాలకు చెందిన మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, పాఠశాలకు అనుబంధంగా ఉన్న వసతి గృహ వివరాలు, విద్యార్థులకు అందిన యూనిఫాం రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఇస్కాన్ ఫౌండేషన్ అందించిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తమ పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌లో సౌకర్యాలు లేవని విద్యార్థులు తెలియజేయడంతో కలెక్టర్ హోదాలో తాను సమకూరుస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. సరిపడా మరుగుదొడ్లు లేవని మరో విద్యార్థి తెలపడంతో నిర్మాణంలో ఉన్న వాటిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పాఠశాలకు అనుబంధంగా ఉన్న వసతి గృహ విద్యార్థుల్లో చాలామంది చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు తెలియడంతో శనివారం అక్కడ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన మందులు సమకూర్చాలని తహసీల్దారు మహబూబ్‌బాషాను ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. కలెక్టర్ తమతో పాటు కలిసి భోజనం చేయడం, తమ సమస్యల గురించి ఆరా తీయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ, పాఠశాల హెచ్‌ఎం శివశంకరయ్య, ఆర్ఐ చాణక్య, వీఆర్వో సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌పై నిఘా

- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా
- కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్
- బాధ్యతలు స్వీకరణ



కర్నూలు, జూలై 19: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల మీద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తామని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం ఉదయం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఏఆర్ పోలీసు సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. పురోహితులు డీఐజీకి ఆశీస్సులు అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన డీఐజీని కర్నూలు ఎస్పీ జి.బిందుమాధవ్, నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, కడప ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేశ్‌కుమార్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఐజీ ప్రవీణ్ విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డీఐజీగా రాయలసీమకు రావడం ఇదే మొదటిసారి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ టీమ్ వర్క్ చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.

పూర్వ ఆర్జేడీపై వారం రోజుల్లో నివేదిక

- అవినీతి ఆరోపణలపై ముగిసిన విచారణ
- విచారణాధికారి డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్



విచారణాధికారి ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నేతలు

కడప (ఎడ్యుకేషన్), జూలై 19: పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతి ఆరోపణలకు సంబంధించి పూర్తి నివేదికలను వారం రోజుల్లో రాష్ట్ర విద్యాశాఖకు సమర్పిస్తామని విచారణాధికారి డైరెక్టర్ ఆఫ్ లైబ్రరీస్ ఎంఆర్ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి రెండవ రోజు శుక్రవారం సైతం కడప పాఠశాల విద్య ఆర్జేడీ కార్యాలయంలో విచారణ కొనసాగింది. కార్యాలయంలో అవినీతి ఆరోపణలకు సంబంధించి పలు రికార్డులను విచారణాధికారి పరిశీలించారు. అలాగే ఆర్జేడీ కార్యాలయం అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డీఈఓ, ఆర్జేడీ కార్యాలయంలో విచారణ పూర్తిచేశామన్నారు. ఆరోపణలు చేసిన వారిని విచారించామన్నారు. మండల స్థాయిలో నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగే అవకాశం ఉందని తెలిపారు. 2016 నుంచి ఉన్న ఫైళ్లను పరిశీలించామని చెప్పారు. బాధితులు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో నాన్చుడు ధోరణి లేకుండా క్రమశిక్షణ చర్యలకు సంబంధించి గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాటిని మూడు నెలల్లోపల పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు.

ఆరుగురికి షోకాజ్ నోటీసులు

రాఘవరెడ్డి అవినీతి ఆరోపణలపై జరుగుతున్న విచారణకు గురువారం ఎటువంటి అనుమతి లేకుండా వచ్చిన ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆర్జేడీ, అన్నమయ్య జిల్లా డీఇఓలకు విచారణాధికారి ప్రసన్నకుమార్ సూచించారు. టి.సుండుపల్లె ఎంఈఓ వెంకటేశ్ నాయక్ పాఠశాలకు హాజరై ఎటువంటి పర్మిషన్ లేకుండా కడప డీఈఓ కార్యాలయానికి హాజరయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగమునిరెడ్డి, రామకృష్ణ, శివకుమార్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేయాలని కడప పాఠశాల విద్య ఆర్జేడీకి సూచించామని తెలిపారు. అలాగే మంగంపేట స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఎస్జీటీ ఆదినారాయణరెడ్డిలకు కూడా నోటీసులు జారీ చేయాలని అన్నమయ్య జిల్లా డీఈవోకు సూచించామన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి: ఎస్టీయూ

అన్నమయ్య, కడప జిల్లాల డీఈవోగా పనిచేసిన పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఆర్జేడీ కార్యాలయంలో విచారణాధికారి ప్రసన్నకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హులను ఓటర్లుగా రాఘవరెడ్డి నమోదు చేయించారని చెప్పారు. స్కూల్ వ్యాన్ డ్రైవర్లు, అటెండర్లు, నర్సరీ టీచర్లను కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేయించారన్నారు. ప్రభుత్వ సెక్టార్‌లోని కేజీబీవీలు, గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు అర్హత లేదని వారిని ఓటర్ల జాబితాలో చేర్పించలేదని తెలిపారు. రివర్స్ పేరుతో అక్రమ బదిలీలకు తెరలేపి లక్షలాది రూపాయలు వసూలు చేశారని, అధిక హెచ్‌ఆర్‌ఏ ప్లేసుల్లో వారికి ప్లేస్‌మెంట్స్ ఇచ్చారని ఆరోపించారు.

అనువు గాని చోట జగనన్న ఇళ్లు

- వంకలు, గుట్టల్లో ఇళ్ల నిర్మాణాలు
- కనీస వసతులు లేక..
- నేటికీ పూర్తికాని గృహ నిర్మాణాలు

సంబేపల్లె, జూలై 19: ప్రతి పేదవాడికి పక్కా గృహం కట్టిస్తామని గొప్పలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని చెప్పవచ్చు. పేదల ఇళ్లు గుట్టలు, వంకల్లో లేఅవుట్లు వేసి జగనన్న కాలనీ పేరిట నిర్మాణాలు చేపట్టారు. సంబేపల్లె మండలంలో నివాస స్థలాలకు అనువుగాని చోట జగనన్న కాలనీల పేరుతో వైసీపీ నాయకులు లేఅవుట్లు వేశారు. జంగిల్ క్లియరెన్స్ కోసం లక్షల రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేశారని చెప్పవచ్చు. ఈ స్థలాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించాలి. ఇక్కడ సరైన సౌకర్యాలు లేక గృహాలు పూర్తి చేయలేదు. కొన్ని గృహాలు నిర్మించినా నివాసాలు లేక దిష్టిబొమ్మల్లా ఉన్నాయి.

ఒక్క గృహం నిర్మించలేదు....

సంబేపల్లె మండలంలోని దేవపట్ల, రెడ్డివారిపల్లె, నాగిరెడ్డిగారిపల్లె గ్రామాలకు సంబంధించి సీఎం కొత్తపల్లి సమీపంలో గుట్టలో జగనన్న లేఅవుట్లు వేశారు. ఇప్పటికీ నాలుగు ఇళ్లు పూర్తి చేశారు. నివాసాలైతే లేవు. కొన్ని ఇళ్లు పునాది వేసి వదిలేశారు. దుద్యాల గ్రామం ఊరగాయగుట్ట హరిజనవాడ సమీపంలో జగనన్న లేఅవుట్లు వేసి ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు ఒక పక్క గృహం కూడా నిర్మించలేదు. కొండకింద హరిజనవాడ ప్రాంతంలో ఒకే ఒక గృహం కట్టారు. వడ్లపల్లి సమీపంలో కొత్తచెరువు మునక ప్రాంతంలో జగనన్న లేఅవుట్ మంజూరు చేశారు. నారాయణరెడ్డిపల్లె గ్రామానికి సమీపంలో ఈ గ్రామ వాసులకు బండ సమీపంలో ఇళ్లు మంజూరు చేశారు. అధికారుల ఒత్తిడితో గృహాలు నిర్మించుకున్నా ఎవరు నివాసాలు లేక దిష్టి బొమ్మల్లా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా గృహాలు నిర్మించారు.

సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు ఇలా...

జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో కూడా గృహాలు నిర్మించుకునేందుకు మండలానికి 1875 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వాటిల్లో ఇప్పటి వరకు పూర్తి చేసినవి 664గా హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. పునాదులు వెయ్యనివి 201, తీసినవి 312, బేస్‌మట్టం వేసినవి 326, గోడల దశలో ఉన్నవి 129, మోల్డింగ్ వేసినవి 123 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కనీసం ఐదేళ్లు అవుతున్నా 50 శాతం గృహాలు కూడా పూర్తి చేయకపోవడం విశేషం.



దుద్యాల వడ్లపల్లి కొత్తచెరువు సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్

ఇంటి సామగ్రి ధరలు పెరిగిపోయాయి



ఇళ్లు నిర్మించుకోవాలంటే అన్ని ధరలు పెరిగిపోయాయి. ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు అయ్యిందన్నారు. కడ్డీలు, సిమెంటు, ఇటుకలు ఇలా ధరలు పెరిగిపోయాయి. కూలీల ధరలు పెంచేశారు. ఒక బేల్దారికి రోజుకు వెయ్యి రూపాయలు ఇవ్వాల్సి వస్తుంది. ఇల్లు కట్టాలంటే భయమేస్తుంది.

-అనగాని రమణయ్య, ముదినేనివాండ్లపల్లె, సంబేపల్లె

లబ్ధిదారులు ముందుకు రావడం లేదు

మండలంలో జగనన్న గృహ నిర్మాణాల కోసం లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. గృహాలు నిర్మించుకునే వారికి బిల్లులు మాత్రం వెంటనే చెల్లిస్తున్నాం.

-శివ, మండల హౌసింగ్ అధికారి





నారాయణరెడ్డిపల్లె వద్ద అసంపూర్తిగా ఉన్న జగనన్న ఇళ్లు, నేటికీ పునాది దశలోనే ఉన్న ఇళ్లు

బీచ్ కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన



బీచ్ కబడ్డీ క్రీడ ఆడుతున్న క్రీడాకారిణులు

కడప (స్పోర్ట్స్), జూలై 19 : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక యోగి వేమన యూనివర్శిటీ మైదానంలో నిర్వహించిన 11వ బీచ్ కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి వంద మందికి పైగా బాల, బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాకారుల పరిచయ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైవీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, మాజీ స్టెప్ సీఈఓ డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ఏదేని క్రీడలో గెలుపోటములు సహజమని, అంతమాత్రాన కృంగిపోకుండా అపజయాన్ని.. విజయంగా మలచుకునేందుకు మరింత శ్రమించాలన్నారు. బీచ్ కబడ్డీ క్రీడ చాలా శ్రమతో కూడుకున్నదని, అందుకు మానసికంగా సంసిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. తదనంతరం హాజరైన బాల, బాలికలకు ఎంపిక ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ.రవీంద్రారెడ్డి, వర్కింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్.శ్రీధర్, ఆర్గనైజర్ అరుణ, పీడీ వెంకటసుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీచ్ కబడ్డీ నిర్వాహకులు కె.రామసుబ్బారెడ్డిని సత్కరించారు.

బీజేపీ తీర్థం పుచ్చుకున్న బీరం



పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరిన బీరం సుబ్బారెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 19: కడపకు చెందిన బీరం విద్యాసంస్థల చైర్మన్ బీరం సుబ్బారెడ్డి భారతీయ జనతాపార్టీలోకి రాజకీయ అరంగేట్రం చేశారు. కడప జిల్లాలో ప్రముఖ విద్యాసంస్థల అధినేతగా బీరం సుబ్బారెడ్డి క్రియాశీలకంగా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ గత పది సంవత్సరాలుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న దృష్ట్యా బీజేపీ పట్ల ఆకర్శితులై పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ మేరకు జిల్లాకు చెందిన బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ద్వారా శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ బీరం సుబ్బారెడ్డి పార్టీలో చేరడంతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించానని, ఇక నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పేదల పురోగతికి శ్రమిస్తానన్నారు.

అడవి పందుల దాడి... అరటిపంట ధ్వంసం



అడవిపందుల దాడి చేసి ధ్వంసం చేసిన అరటిమొక్కలు

వేంపల్లె, జూలై 19: వేంపల్లె పట్టణ సమీపంలో అడవిపందులు అరటిపంటపై స్వైర విహారం చేశాయి. సుమారు నాలుగు ఎకరాల్లో మూడు నెలల క్రితం నాటిన ఆరు వేల అరటిమొక్కలను పందులు మూకుమ్మడిగా నేలకూల్చాయి. కుప్పాలపల్లె గ్రామానికి చెందిన రైతు కె.రామగంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలు వేంపల్లె పట్టణం బైపాస్ రోడ్డు సమీపంలో పాములూరు గుట్టల కిందివైపు పది ఎకరాల్లో అరటిపంట సాగుచేశారు. గురువారం రాత్రి అడవిపందులు దాడి చేసి నాశనం చేశాయి. ఎకరాకు రూ.1.50 లక్షల దాకా ఖర్చు అయ్యిందని.. కంటికి రెప్పలా కాపాడి పెంచుకున్న అరటిమొక్కలను పందులు నాశనం చేశాయని రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి దారుణహత్య



హత్యకు గురైన వెంకటేశ్

కడప క్రైమ్, జూలై 19: కడప నగర బిల్టప్ సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి చింపిరి వెంకటేశ్ (32) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న తాలుకా సీఐ తిమ్మయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. సీఐ వివరాల మేరకు... అంబభవానీ నగర్‌కు చెందిన వెంకటేశ్ జులాయిగా తిరుగుతుండేవాడు. రవీంద్రనగర్‌కు చెందిన సాధక్ వలిలు రాత్రి మద్యం సేవించేందుకు బిల్టప్ సర్కిల్‌కు వెళ్లారు. మద్యం సేవించిన ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో సాధిక్‌వలి బీరు బాటిల్‌తో వెంకటేశ్ మెడపై పొడవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి.. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు. హత్య జరిగినప్పుడు వీరు ఇరువురే ఉన్నారా.. వీరితో పాటు ఎవరెవరు ఉన్నారనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉందన్నారు. కాగా, మృతుడు వెంకటేష్‌పై తాలూకా పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు సీఐ తెలిపారు.

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితుడితో ఫారెస్టు అధికారులు

కడప క్రైమ్, జూలై 19: కడప అటవీ డివిజన్ పరిధిలోని నాగసానిపల్లె బీట్ సమీపంలో ఎర్రచందనం దుంగలు రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఫారెస్టు ఫ్లయింగ్ స్క్వాడ్ గురుప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఎర్రచందనం దుంగలను కొంత మంది అడవి నుంచి డంపింగ్ చేసేందుకు తీసుకొస్తుండగా సిబ్బందిని చూసి స్మగ్లర్ల పరారయ్యారని.. నాగసానిపల్లెకు చెందిన ఈట్ల రామకృష్ణాను అరెస్టు చేసి.. తొమ్మిది దుంగలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా..ఒకరు మృతి

మైదుకూరు రూరల్ జూలై 19: దువ్వూరు మండలం కానగూడురు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో సారుకోళ్ల వీరయ్య అలియాస్ ఆపయ్య(55) అక్కడిక్కడే మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు...

చాపాడు మండలం నెర్రవాడకు చెందిన రైతులు వరి విత్తనాల కొనుగోలుకు నంద్యాలకు వెళ్లి రేటు కుదరకపోవడంతో తిరిగి వస్తున్నారు. ఆటో కానగూడురు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న సారుకోళ్ల వీరయ్య మృతి చెందాడు. మరో నలుగురు గాయపడటంతో ఆళ్లగడ్డలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

చాపాడు, జూలై 19: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన షేక్ మహమ్మద్ అనే వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించింది. ప్రొద్దుటూరు పట్టణం శ్రీనివాస్‌నగర్ వాసి షేక్ మహమ్మద్.. చాపాడు మండలంలోని అనంతపురం దళితవాడకు చెందిన సోనా అనే యువతి సీబీఐటీ కళాశాలలో చదువుతుండగా ప్రేమించుకున్నారు. సోనా తనను పెళ్లి చేసుకోవాలని మహమ్మద్‌పై ఒత్తిడి తేవడంతో.. నీవు ఎస్సీ అని తన తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని నిరాకరించాడు. ఈ మేరకు బాధితురాలు సోనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం మహమ్మద్‌ను అరెస్టు చేసి.. మైదుకూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

జీతాల పెంపులో నాన్‌పీహెచ్ వర్కర్లకు అన్యాయం

- ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 19: మున్సిపల్ కార్మికుల సమ్మెలో కొన్ని కార్మిక సంఘాలు అవకాశవాద వైఖరి కారణంగా మున్సిపాలిటీల్లో నాన్‌పీహెచ్ కింద పనిచేసే కార్మికులకు వేతనాల పెంపులో అన్యాయం జరిగిందని ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎన్‌జీఓ హోంలో ప్రగతిశీల కార్మిక సంఘం అనుబంధంగా చైతన్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 55వేల మంది కార్మికులున్న మున్సిపాలిటీలో కార్మిక సంఘాలు సంఘటిత శక్తిగా వున్నప్పుడే మున్సిపల్ రంగంలో కార్మికుల సమస్యలన్నీ పరిష్కారమౌతాయన్నారు. పనికి సమాన వేతనం అమలు కావాలంటే కార్మిక సంఘాలు కార్మికుల హక్కులకు భరోసా శక్తిగా పనిచేయాలన్నారు. లేబర్ కోడ్ బిల్లులపై ఐక్యంగా పోరాడాల్సిన ఆవశ్యకత వుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న మున్సిపల్ సమస్యలు, లోకల్‌గా మున్సిపాలిటీల్లో కార్మికుల సమస్యలపై చైతన్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు వెన్నుదన్నుగా పనిచేస్తుందన్నారు. సమావేశానికి పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అధ్యక్షత వహించగా చైతన్య వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, గౌరవ సలహాదారుడు మురళీ ప్రసాద్, రచయిత ఎస్సీ మహమూద్ ప్రసంగించారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా అరుణ్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

కళలను ఆదరించాలి : కలెక్టర్



సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19: కళలను ఆదరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. సావిత్రి బాయి పూలే కోలాట బృందం ఇటీవల ద్వారకా తిరుమలలో 122 మంది మహిళలతో దశావతారాలు జానపద కోలాట నృత్యం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ఇటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డు లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గోల్డెన్ పార్కులో కోలాట బృంద సభ్యులకు అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ నేటిడిజిటల్ యుగంలో ప్రాచీన కళలు ఆదరణ కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోలాటం ఆంధ్రప్రదేశ్‌కు చెందినప్రముఖ కళ అని, నేటి యువత ఆ కళపై ఆసక్తితో నేర్చుకుని ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కోలాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కోలాటానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ కోలాటం, చెక్కభజన పూర్వం నుంచి ఉన్న కళలు అని, అయితే సినిమాల రాకతో అవి మరుగునపడ్డాయన్నారు. మహిళలు ఉత్సాహంతో కోలాటం నేర్చుకోవడం హర్షణీయమన్నారు. కోలాటం నృత్యాన్ని ప్రదర్శించి అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. కోలాటంను బృందం సభ్యులు భవిష్యత్తు తరాల వారికి నేర్పించి ఆదర్శంగా నిలువాలని కోరారు. అనంతరం బృందం సభ్యులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఇంటర్నేషల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లను కలెక్టర్, ఎమ్మెల్యేలు బృందం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దారు విద్యాసాగర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పల్లా రాజగోపాల్‌యాదవ్, రామక్రిష్ణబాబు, కోలాటం బృందం నాయకురాలు బండి మల్లిక, సినీ నటుడు బాబు, డ్యాన్స్‌మాస్టర్ ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో... మాన్యం భూములకు మోక్షం

రాయచోటిటౌన్, జూలై 19: రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో అన్యాక్రాంతమైన దేవాదాయశాఖకు చెందిన 42 ఎకరాల మాన్యం భూములకు మోక్షం వచ్చింది. సంబేపల్లె మండలం దేవపట్ల రెవెన్యూ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్న ఆవుల మాన్యం భూములను ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని సర్వేనెంబర్ 330లో 37.06 ఎకరాలు, సర్వే నెంబర్ 506లో 4.28 ఎకరాలు, సర్వే నెంబర్ 570లో 0.5 ఎకరాల మాన్యం భూములకు సరిహద్దులు నిర్ణయించి శుక్రవారం దేవాదాయశాఖ అధికారులకు స్వాధీనపరిచారు. ఇదే మండలంలో వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్న మరికొన్ని ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనపర్చుకునేందుకు రెవెన్యూ అధికారుల బృందం విచారణ చేపట్టింది. త్వరలోనే మరిన్ని భూములు ప్రభుత్వానికి స్వాధీనం కానున్నాయి.

ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలి : కలెక్టర్

రాయచోటి టౌన్, జూలై19: ప్రతి ఇంటికి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈని ఆదేశించారు. శుక్రవారం రాయచోటి మండలం ఏపిలవంకపల్లి, గొరముదివేడు గ్రామంలో ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలని గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ ప్రసన్న కుమార్‌ను ఆదేశించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ట్రాక్టర్ ఎక్కడ వరకు వెళ్తే అక్కడ వరకు వెళ్లి నీటిని వదిలేలా చూడాలని ఈవోపీఆర్‌డీకి తెలిపారు. త్వరలో కాలువలు మంజూరయ్యేలా చూస్తానని గ్రామస్థులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ ప్రసన్నకుమార్, ఈవోపీఆర్‌డీ, ఎంపీడీవో, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రికి రేడియోగ్రాఫర్ కరువు

- ఎక్స్‌రే కోసం రోగుల అవస్థలు... ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు



పులివెందులలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

పులివెందుల రూరల్, జూలై 19: పులివెందులలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రేడియోగ్రాఫర్ కరువయ్యారు. 20 రోజుల నుంచి రేడియోగ్రాఫర్ లేకపోవడంతో ఎక్స్‌రే కోసం రోగులు ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తూ వందల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వివరాలు ఇలా... పులివెందులలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా డాక్టర్ వైఎస్సార్ సర్వజన ఆసుపత్రి నిర్మించారు. ఇందులో ఔట్ పేషంట్, ఇన్ పేషంట్, ఎమెర్జెన్సీ వార్డులు నిర్మించి 420 పడకలు ఏర్పాటుచేశారు. ప్రతి రోజు దాదాపు 700 నుంచి 900 దాకా రోగులు వస్తున్నారు. ఇంత మంది ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు వస్తున్నా రేడియో గ్రాఫర్ లేకపోవడం దారుణం. గత నెల 30వ తేదీ ఇక్కడ పనిచేస్తున్న రేడియోగ్రాఫర్ రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి ఎక్స్‌రే గది మూతపడింది. సాధారణ దగ్గుతో పాటు క్షయ వ్యాధి సోకిన వారికి, పలు ఊపిరితిత్తుల సమస్య ఉన్న వారికి ఎక్స్‌రే తీయించుకోవాల్సిందే. అంతేకాకుండా ప్రమాదాలు జరిగినపుడు ఎముకలు బెసకడం లేదా విరగడం జరుగుతుంటాయి. వీటిలో ఏమి తెలుసుకోవాలన్నా ఎక్స్‌రేలో బయటపడుతుంది. శస్త్రచికిత్సలకు కూడా ఎక్స్‌రే అతిముఖ్యమైనది. వీటితో పాటు సదరం క్యాంప్‌లు జరిగినపుడు ఎముకల విభాగం వైద్యులు తప్పనిసరిగా ఎక్స్‌రే తీపిస్తుంటారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే విభాగం అధిక పాత్ర పోషిస్తుంటుంది. కానీ పులివెందుల ఆసుపత్రిలో మాత్రం ఎక్స్‌రే యంత్రాలు ఉన్నప్పటికి రేడియోగ్రాఫర్ లేరు. దీంతో చికిత్సకు దూరప్రాంతాల నుంచి వచ్చేరోగులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. మరికొందరు ప్రైవేటు ఎక్స్‌రే కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రేడియోగ్రాఫర్‌ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తాళం వేసిన ఎక్స్‌రే గది

ఉన్నతాధికారులకు తెలియజేశాం

రేడియోగ్రాఫర్ లేకపోవడంతో ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. పరిస్థితిని వివరించాం. త్వరలో రేడియోగ్రాఫర్ నియామకం జరుగుతుంది.

-డాక్టర్ మల్లీశ్వరి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, పులివెందుల.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ
జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, కడప.
టెండర్ నోటీసు

ఆర్.సి.నెం: 159/A2/డి.డబ్ల్యూ.&సి.డి.ఎ./కడప తేది : 19.07.2024

జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, కడపజిల్లాలోని ICDS Projects 183 Saksham అంగన్వాడి కేంద్రములకు RO Units (ISI Certified) సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు కోరడమైనది. రూ. 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు) బ్యాంకు డ్రాఫ్ట్ రూపములో ప్రాజెక్ట్ డైరెక్టర్, డి.డబ్ల్యూ.&సి.డి.ఎ. కడప పేరిట చెల్లించి టెండర్ డాక్యుమెంట్లు 20.07.2024వ తేది నుండి కార్యాలయ పనివేళలో పొందవలెను. ఈ టెండర్ రద్దు చేయుటకు, తేది పొడిగించుటకు సర్వ అధికారము జాయింట్ కలెక్టరు /చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటి, కడప వారికి కలదు. Tender Schedule పొందుటకు ఆఖరు తేది : 26.07.2024, Tender Schedule సమర్పించుటకు ఆఖరు తేది : 26.07.2024 3.00 P.M. వరకు, Tender తెరచు తేది : 26.07.2024 4.00 P.M.కు అని తెలియచేయడమైనది.

సంయుక్త కలెక్టరు మరియు చైర్మెన్ వారి తరపున
జిల్లా కొనుగోలు కమిటీ, కడప.
Sd/- డి. శ్రీలక్ష్మి
Dist. Women & Child Welfare & Empowerment Officer,
YSR District, Kadapa.

నారా లోకేశ్‌ను కలిసిన రాయచోటి టీడీపీ అధ్యక్షుడు



నారా లోకేశ్‌తో బోనమల ఖాదర్‌వలి

రాయచోటి టౌన్, జూలై 19: పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును, అనంతరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూల బొకేలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాయచోటి పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి నిధు లు మంజూరు చేసి సహకరించాలని నారా లోకేశ్ బాబు ను కోరారు.

దేవదాయ భూములను కాపాడాలి

లక్కిరెడ్డిపల్లె జూలై 19: రాష్ట్రంలోని దేవాదాయ శాఖ భూములను కాపాడాలని బీజేపీ సీనియర్ నాయకులు కృష్ణ, జయచంద్ర నాయుడు కోరారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో వారు విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఆక్రమించుకున్న దేవాదాయశాఖ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. .తిరుమలలో లడ్డూ తయారీ బాధ్యతలను అన్య మతస్థులకు ఇవ్వడంతో నాణ్యత లేదన్నారు. దేవాదాయశాఖ భూములను ఆక్రమించిన వారిపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను. కోట్ల రూపాయల విలువ చేసే భూములను పెత్తందారీ ఎతులకు అప్పగించి వారి కి దోచిపెట్టారన్నారు.

ఆర్వీఎస్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడుగా బండి వెంకటసాయి పరశురాం

గాలివీడు, జూలై 19: రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం యూత్ వింగ్ అధ్యక్షుడుగా బండి వెంకటసాయి పరశురాంను నియమిస్తూ సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి వాల్మీకి ఉత్తర్వులు జారీ చేశారు. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలన్న నినాదాన్ని బలోపేతం చేయాలని సూచించారు. తమ జాతి యొక్క అభ్యున్నతికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పరశరాం అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షుడు కుర్లపల్లి మోహన, జాయింట్ సెక్రటరీ పెనుగొండ ఆనంద్, అధికార ప్రతినిధి మేకల శివప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జూలై 19: పట్టణంలోని వీరభద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శంకరయ్య స్వామి రాహుకాల పూజ విశిష్టతను తెలియజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి అర్చకుడు కృష్ణయ్యస్వామి పాల్గొన్నారు.

రేపు అంకాలమ్మ జాతర

పెనగలూరు, జూలై 19 : మండల పరిధిలోని కట్టావారిపల్లెలో ఆదివారం అంకాలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం రాత్రి పోతులరాజు ఊరేగింపు. ఆదివారం తెల్లవారుజామున అంకాలమ్మ ఆసాది కథ, తర్వాత ప్రధాన పోతు బలి కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రజా సమస్యలే .. అధికారుల ఎజెండా కావాలి

● మండల సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



దర్గాలో ప్రార్థన చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై 19: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదని తమకు ఫిర్యాదులు అందుతున్నాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం చిన్నమండెం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, గ్రామాల్లో చేతిపంపులు, మోటార్ల మరమ్మతులు, పారిశుధ్య పరిరక్షణలో నిర్లక్ష్యం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో లోపాలు, హౌసింగ్ అవకతవకలపై ఆగ్రహించారు. ఆర్బీకేలతో రైతులకు మేలుకంటే వాటి నిర్వహణకే ఎక్కువ ఖర్చు అవుతోందన్నారు. అధికారులు పేదల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అర్హులైన పేలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎంపీపీ సుధా మాధురి, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, ఎంఈడీవో రామకృష్ణ, తమసీల్దార్ ఆనంద్‌కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించారు

జమాలుల్లా బాబా దర్గాలో ప్రార్థనలు

రాయచోటిటౌన్: రొట్టెల పడుగను పురస్కరించుకొని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ముస్లింలతో కలిసి పట్టణంలోని జమాలుల్లా బాబా దర్గాను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాకు విచ్చేసిన మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం మజార్‌పై పూలచాదర్‌ను కప్పి ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నా నన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

● అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గాలివీడు: మండల కేంద్రంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబనాయుడు నిర్విరామంగా కృషి చేస్తున్నాడని కొనియాడారు. ఇటీవల మరణించిన టీడీపీ నేత కేడం జయరాములు దశ దినకర్మ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. శుక్రవారం మరణించిన టీడీపీ నేత కుమార్‌రెడ్డి కొడుకు భౌతిక కాయానికి ఘన నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, భద్రప్పనాయుడు, ఫరీద్‌బాషా, శ్రీనివాస్‌రాజు, ప్రభాకర్ నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కేడం లక్ష్మయ్య, టీడీపీ నాయకులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి, నాగేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, రాం మోహన్ నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, రమణారెడ్డి, రాఘవులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

● రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రామాజగదీశ్



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు

సుండుపల్లె, జూలై 19: బాహుదా, పించా నదుల నుంచి ఇసుక అక్రమ రవాహనాకు అడ్డుకట్ట వేయాలని తహసీల్దార్ జరీనాబేగం, ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేసినట్లు రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని బాహుదా నదిలో ఏర్పడ్డ గుంతలను పరిశీలించారు. ఇసుక తరలింపుతో సాగునీటితో పాటు తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా వైసీపీ నాయకులు ఇసుక అక్రమంగా అమ్ముకున్నా, ఎవరూ పట్టించుకోలేదని, కనీసం ఇప్పుడైనా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని అధికారులను కోరారు. ప్రతిరోజు రాత్రిపూట సుండుపల్లెలో ఇసుక అక్రమ రవాణా పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తెలియడం లేదా అని ప్రశ్నించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని వినతి పత్రంలో కోరారు. ఇసుక రీచ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజలకు ఇసుక అందించాలన్నారు. టీడీపీ నాయకులు మాలేపాటి సురేశ్‌నాయుడు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుబ్బరాజు, బీజేపీ నాయకులు గోపాల్‌రాజు, సత్యంనాయుడు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుబ్బరామరాజు, బీసీ నాయకులు సురేశ్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పునరావృతం కాకూడదు

● రాజ్యసభ సభ్యుడు మేడా, ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు, జూలై 19 : ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి, రాజం పేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల అధ్య క్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వీరు హాజరయ్యారు. మం డల అధికారులు పరిష్కరించలేని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు కరీముల్లాఖాన్ మాట్లాడుతూ గొల్లపల్లె ఉర్దూ పాఠశాలలో గదుల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో మూడేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలలో వేడి నీటి కోసం హీటర్లను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ హరిత కోరారు. దీంతో మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ నిధులతో కాని, తన సొంత నిధులతోనైనా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సందర్భంగా విద, వైద్య, వ్యవసాయ, ఉపాది, రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర సమస్యలపై చర్చించారు. గొడవలకు తావివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, డిప్యూటీ తహసీల్దారు మోహన్‌కృష్ణ, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి గ్రేసీ హ్యాండ్స్ చేయూత...

రైల్వేకోడూరు(రూరల్) జూలై, 19: అరుదైన కేన్సర్‌తో బాధపడుతున్న 9 నెలల చిన్నారి హితేషి వైద్యం కోసం రైల్వేకోడూరు గ్రేసీ హ్యాండ్స్ సంస్థ. సభ్యులు చేయూత అందించారు. గత నెల 20న ఆంధ్రజ్యోతిలో మా పాపను బతికించండి శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన సంస్థ సభ్యులు రూ. 36 వేలు సేకరించి శుక్రవారం బాధితుల బ్యాంకు ఖాతాలో జమచేసి, చిన్నారి తండ్రి ప్రీతం, తల్లి గౌతమికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సహకరించిన దాతలకు గ్రేసీ హ్యాండ్స్ అధ్యక్షుడు అమర్నాధ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్ఐ కాటమయ్య, వెంబడి రాధాకృష్ణ నగిరిపాటి జంగయ్య, చాపల తిరుపాల్, నగిరిపాటి మహేష్, చంటి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

చిన్నమండెం, జూలై19: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రాజెక్టుల ప్రదర్శన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరులతో పోటీపడి బాగా చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందన్నారు. క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యా ర్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విజయ భాస్కర్, దేవప్రసాద్‌రెడ్డి, జోసెఫ్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలకు సౌండ్ సిస్టం విరాళం

రాయచోటిటౌన్, జూలై 19: పట్టణంలోని అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రాంమోహన్ రెడ్డి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రూ.20 వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, ప్రార్థన సమావేశానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రధానోపాధ్యా యుడు షేక్.జాబీర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం దాతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ ఇలియాస్, మహ మ్మద్ బాషా, జయన్న, జగదీశ్వరాచారి, అబ్దుల్ రహీంఖాన్, చాన్‌బాషా, రహంతుల్లా, నరసరాజు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి క్షేత్ర సహాయకుడిపై విచారణ

వీరబల్లి, జూలై 19: వీరబల్లి క్షేత్ర సహాయకుడిపై చర్యలు తీసుకోవాలని ఈడిగపల్లెకు చెందిన ఉపాధి కూలీలు ఫిర్యాదు చేయడంతో ఏపీవో నాగరాజు శుక్రవారం విచారణ చేశారు. భిన్నాభి ప్రాయాలు వ్యక్తం కావడంతో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహా యకులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన జనసేన నాయకులు



డీఐజీని సత్కరిస్తు,న్న రాజంపేట జనసేన నాయకులు

కర్నూలు, జూలై 19: కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ కుమార్ శుక్రవారం బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ రిటైర్డ్ అధికారి, రాజంపేట పార్లమెంట్ జనసేన ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనివాస రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీకి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన డీఐజీని కోరారు. ఆయనతో పాటు రాజంపేట, నందలూరు జనసేన నాయకులు, మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, రిటైర్డ్ ఎస్ఐ కె.శ్రీనివాసులు, కడప జిల్లాకు చెందిన నాయకులు, అధికారులు డీఐజీని కలిసి అభినందనలు తెలిపారు.

ఉద్యోగులతో చర్చించి ఐఆర్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంకం శివారెడ్డి

రాయచోటిటౌన్, జూలై 19: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మొలకలచెరువు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడుతూ 12వ పీఆర్‌సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, మెచ్యూర్ అయిన బాండ్ల పేమెంట్లు త్వరితగతిన చెల్లించేలా ఆర్థికశాఖను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా నాయకులు రామకృష్ణ, అమర్‌నాధరెడ్డి, మండల నాయకులు వెంకట్రమణ, సుబ్బరాయప్ప, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులు ప్రారంభం

రాయచోటిటౌన్, జూలై19: పట్టణం లోని అంబేద్కర్ కాలనీలో శుక్రవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో పెండింగ్‌లో ఉన్న పైపు లైన్ పనులను శుక్రవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి సోద రుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి, మున్సి పల్ కమిషనర్ వాసుబాబుతో కలిసి పైపులైన్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సి పాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఆర్టీసీ బస్టాం డు లో ప్రయాణికుల సౌకర్యార్థం శాశ్వత మంచినీటి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంలకు ప్రమోషన్లు ఇవ్వాలి

రాయచోటి (కలెక్టరేట్), జూలై 19: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ,వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీస్ (ఏఎన్ఎం)లకు తక్షణమే ప్రమోషన్ చానల్ అమలు చేయాలని, ఆన్‌లైన్ యాప్‌ల భారం తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సచివాలయ హెల్త్ సెక్రెటరీ జిల్లా కార్యదర్శి ఉషారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జి.ఓ.ఎం.ఎస్..179 ప్రకారం మూడు సంవత్సరాలు సర్వీస్ నిండి, డిపార్టుమెంటల్ పాస్ అయిన వారికి ఎంపీహెచ్ఏగా మార్చాలన్నారు. నాలుగు సంవత్సరాలైనా ఇంతవరకు పురోగతి లేదన్నారు. సచివాలయంలో పని చేస్తున్న ఏఎన్ఎంలు దాదాపు 43 రకాల యాప్‌లతో చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. బయోమెట్రిక్ హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా పదోన్నతులు కల్పించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నివారించాలి



మద్దిరేవుల సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమణ

లక్కిరెడ్డిపల్లె, జూలై 19: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ సిబ్బంది జాగ్రతలు తీసుకోవాలని అలాగే వ్యవసాయ కనెక్షన్లకు సకాలంలో విద్యుత్ సరఫరా చేయాలని ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ ఆదేశించారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలోని మద్దిరేవుల 33/11 సబ్‌స్టేషన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లు, లైనను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ సభాభవనంలో వీరబల్లి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె విద్యుత్ క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో స్తంభాలకు విద్యుత్ సరపరా కాకుండా లైన్లను పరిశీలిస్తుండాలన్నారు. లూజులైన్లు లేకుండా జాగ్రతలు తీసుకోవాలని, కట్టెలపైన విద్యుత్ లైన్లును ఉన్న చోటప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు రోడ్లపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెగానీ, ప్రహరీగానీ ఏర్పాటు చేయాలన్నారు. లక్కిరెడ్డిపల్లె ఏడీఈ రామచంద్రారెడ్డి, ఏఈ హరినాథ మూడు మండలాల విద్యుత్‌అధికారులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంపై వివాదం

రాజంపేట టౌన్, జూలై 19 : మండల పరిధిలోని ములక్కాయలపల్లెలోని ఓ స్థలంపై దళితులు, అగ్రవర్ణాల మధ్య వివాదం కొనసాగుతోంది. సర్వే నెంబరు 1713లోని 0.20 సెంట్ల భూమిని శ్మశానంగా వినియోగించు కునేందుకు రెవెన్యూ అధికారులు త మకు కేటాయించారని దళితులు చె బుతున్నారు. అందులో ఖననం చేసేందుకు వెళితే అగ్రవర్ణాలవారు అడ్డుపడుతు న్నారని అంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ స్థలానికి కంచె వేస్తున్నట్టు సమాచారం అందడంతో అడ్డుకునేందుకు రాగా తమపై దాడికి దిగుతున్నారంటూ దళితులు మమన్నూరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమస్యపై విచారణ చేశారు. దళితులకు కేటాయించిన భూ మి ఇది కాదని అగ్రవర్ణాలవారు చెప్పడంతో, సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అప్పటివరకు ఎలాంటి వివాదం సృష్టించరాదని హెచ్చరించారు.

హాస్టల్‌లో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ



ఎస్సీ బాలుర హాస్టల్‌ను పరిశీలించిన ఎంపీడీవో

సిద్దవటం, జూలై 19 : స్థానిక ప్రభుత్వ బాలుర ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, ఎంఈవో అరుణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. వర్షాకాలంలో విద్యార్థులకు వేడిచేసిన నీటిని అందించాలని, జ్వరాలు రాకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శివశంకరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూలి అందక ఉపాధి కూలీల ఇక్కట్లు

సిద్దవటం, జూలై 19 : మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు 8 వారాలుగా కూలి అందడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా జ్వరాలబారిన పడుతుండగా, కూలి డబ్బు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామ అంటున్నారు. ఈ విషయంపూ ఉపాధి హామీ ఏపీవో నరసింహులు మాట్లాడుతూ 8 వారాలుగా కూలీలకు డబ్బులు చెల్లంచని విషయం వాస్తవమేనని, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయ్యాయని, జూలై 25వ తేదీ లోపు కూలీల ఖాతాల్లో బకాయిలు జమ అవుతాయని తెలియజేశారు.

సీఎం చంద్రబాబు దృష్టికి కోడూరు సమస్యలు



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, జూలై 19: నియోజకవర్గంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను గురు వారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు రైల్వే కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు, గాలేరు-నగరి కాలువ, ఆర్‌అండ్‌బీ రోడ్లు, అండర్ గ్రౌండు డ్రైనేజి, కోడూరు- వెంకటగిరి రోడ్డు తదితర సమస్యలను పరిష్కారం చేయాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

మంత్రిని కలసిన జనసేన, టీడీపీ నాయకులు



మంత్రిని కలసి వినతిపత్రం ఇస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

రైల్వేకోడూరు, జూలై 19: రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు స్వామిని శుక్రవారం విజయవాడలో రైల్వేకోడూరు జనసేన నాయకులు మర్రి రెడ్డి ప్రసాద్, కువైత్ ఎన్ఆర్ఐ దుర్గం మోహన్, టీడీపీ నాయకులు పందేటి మహేశ్వర్ రాజు తదితరులు కలిశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని బాలురు, బాలికల హాస్టళ్లలోని అసౌకర్యాలను వివరించగా, మంత్రి వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారని విలేకరులకు తెలిపారు.

అన్యమత ప్రచారంపై చర్యలు తీసుకోవాలి



సీఐకి వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రైల్వేకోడూరు, జూలై 19: అన్యమత ప్రచారంపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు నియోజకవర్గ విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి, బీజేపీ నాయకులు పులపుత్తూరి రామసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం అన్యమత ప్రచారంపై రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి రెవెన్యూ, పోలీసులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచె చేను మేస్తున్న చందంగా ప్రజల సొమ్ముతో అణగారిన వర్గాల మాటున ప్రభు త్వ ఉద్యోగాలు సంపాదించి అన్ని ప్రభుత్వ ఫలాలను అనుభవిస్తూ, వాటి ముసుగులో అన్యమత ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తులు ప్రచార కులుగా మారి చర్చిలు నిర్వహిస్తున్నారన్నారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉద్యోగులు రెండు రోజుల క్రితం రైల్వేకోడూరు మండలంలోని విద్యానగర్ ప్రాంతంలో అన్యమత ప్రచారం చేస్తుండగా అడ్డుకున్నామన్నారు. అధికారులు ఇలాం టి సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు అలుగంటి దశరథ రామయ్య, ఎస్ఎస్ఎఫ్ నాయకులు టి. సుబ్బరాయులు ఆచారి, బీజేపీ నాయకులు సాయం శ్రీధర్, దామో దర్, శివయ్య, మంకు రమణ, కాళప్పగారి రాము, దామోదర్, వాకచర్ల సుబ్బారావు, వీహెచ్‌పీ నాయకులు ఎస్. మల్లికార్జున తదితరులు పాల్గొ న్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లె జూలై 19: సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తం గా ఉండాలని కోనంపేట వైద్యా ధికారి సిద్దయ్య హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించా రు. కాచి చల్లార్చిన నీటిని తాగా లని, భోజనానికి ముందు చేతు లు శుభ్రం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దోమల వలన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. కుష్టువ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలన్నారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, సిబ్బంది ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం పరిశుభ్రత పాటించాలి



వ్యక్తిగత పరిశుభ్రతపై వివరిస్తున్న పంచాయతీ సిబ్బంది

పెనగలూరు, జూలై 19 : ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పెనగలూరు పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఎన్ఎం సుప్రజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుజ్ఞాని పెనగలూరు పంచాయతీ ప్రజలను కోరారు. శుక్రవారం సాతపల్లె, హరిజనవాడ, ఇండ్లూరు కుమ్మరపాలెం, పెనగ లూరు అరుంధతివాడ గ్రామాల్లో పర్యటించారు. వర్షాకాలం ప్రారంభమైనందువల్ల దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



తెలుగు సాహితీ లోకానికి తీరని వెలితిని మిగిల్చి ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో కన్ను మూశారు. దళిత స్పృహ, అభ్యుదయ భావజాలంతో యాభై ఏళ్లుగా ఆయన నిరంతరాయంగా కవిత్వం రాశారు. ఆయన కవిత్వం అచ్చుకాని పత్రిక ఏదీ తెలుగు నేలమీద లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి పరిణామాన్నీ నిశితంగా గమనిస్తూ కవిత్వ రూపంలో స్పందించడం ఆయన ప్రత్యేకత.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)

తెలుగు కవిత్వంలో

నిలువెత్తు సంతకం

అడిగోపుల వెంకటరత్నంకు నివాళి

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లు అడిగోపుల వెంకటరత్నం పుట్టిన ఊరు. నాగార్జున యూనివర్సిటీలో ఇంజనీరుగా చేస్తూనే కవిత్వం విరివిగా రాసేవారు. రిటైరయ్యాక తిరుపతిలో స్థిరపడ్డారు. భార్య పద్మజ, కుమార్తెలు మాధవి, శాంతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు.విదేశాల్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చాక ఆయన చివరి కోరిక ప్రకారం స్వస్థలం కొత్తవంగల్లులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

అడిగోపుల కవితా సంపుటాలు

సూర్యోదయం, ఎన్నాళ్ళీ చరిత్ర, పురోగతి అంచున, జీవన పోరాటం, బానిసత్వం అమ్మబడును, మరణానికి రెండు ముఖాలు, విప్లవానికి పురిటిగది, ఆకాశవీధిలో అగ్నిగానం, యుద్ధమంటే మాకు భయం లేదు, మట్టి మౌనం వహించదు, మహాపథం, రాతి చిగుళ్ళు, అదృశ్యకుడ్యం, సంకెళ్ళు తెగిన చప్పుళ్ళు, శ్వేతపత్రం, విశ్వగీతం, రంగుల చీకటి, రేపటి వర్తమానం, రెక్కవిప్పిన రాగం, రేపటి జ్ఞాపకం, ముందడుగు, పదండి ముందుకు, కాలం నా చేతిలో ఉంది, జయభేరి, కొత్తగాలి, నిలువెత్తు సంతకం.

అందుకున్న అవార్డులు

కుందుర్తి పురస్కారం, శ్రీశ్రీ అవార్డు, తానా అవార్డు, కరుణశ్రీ అవార్డు, వాసిరెడ్డి - సుంకర అవార్డు, తెలుగు వర్సిటీ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ కవిరత్న అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, గిడుగు పురస్కారం, నూతలపాటి కవితా పురస్కారం, కొలకలూరి భాగీరథి పురస్కారం, ఉమ్మడిశెట్టి పురస్కారం, గార్లపాటి సిద్ధమనాయుడు పురస్కారం, విశాలాక్షి సాహిత్య పురస్కారం.

"నిన్నటి మొన్నటి జ్ఞాపకం.. వర్తమానంలో ఉంటుంది. నేటి జ్ఞాపకం, రేపటి జ్ఞాపకం.. భవిష్యత్తులో ఉంటుంది... నా అంటరానితనం దూరంగా కూర్చొన్న జ్ఞాపకం.. ఇది గతం. రేపు నేను మరణించాక అంటరానితనం వెంటబడి ఊరిదారి అనుమతించక ఊరిబయటే ఉంటుంది... నా శవప్రస్థానం... నా రేపటి జ్ఞాపకం కాకూడదు." అని తన కవిత్వంలో విస్పష్టంగా ప్రకటించిన కవి అడిగోపుల వెంకటరత్నం. "మల్లెచెట్టు కింద మల్లెతీగలం.. ఎదుగూ బొదుగూ లేని వాళ్ళం.." అంటూ తెలుగు కవిత్వంలో దళిత జీవితంలోని దైన్యాన్ని అనేక దశాబ్దాల క్రితమే వినిపించిన కవి ఈయన. ఆరుద్ర, ఆత్రేయ, రావూరి భరద్వాజ, సినారె, రాచపాళెం, సంజీవ్‌దేవ్, గుంటూరు శేషేంద్రశర్మ, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, రావిశాస్త్రి, వంటి ప్రముఖుల చేత ప్రశంసలు పొందిన కవి అడిగోపుల వెంకటరత్నం. కుమారుడు శ్రీకాంత్ చిత్రకారుడిగా గుర్తింపు పొందారు. అడిగోపుల కవితా సంపుటాలకు కుమారుడు రూపొందించిన చిత్రాలనే ముఖచిత్రాలుగా ముద్రించుకున్నారు. అడిగోపుల కవిత్వంపై శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎస్. భీమన్న పరిశోధన చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పద్మకుమారి పరిశోధన చేశారు. నాగార్జున యూనివర్సిటీలో అడిగోపుల కథలపై త్రివిక్రమ సూరి ఎంఫిల్ చేశారు.



నానీకి మా పెద్దిరెడ్డే గాడ్‌ఫాదర్

- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆయనకు వెన్నెముకలా నిలిచారు
- టీడీపీ ఎమ్మెల్యే నానిపై చెవిరెడ్డి సంచలన ఆరోపణలు

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి వైసీపీ పాలనలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నెముకలా అండగా నిలిచారని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'పులివర్తి నానీకి మా పార్టీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డే గాడ్ ఫాదర్' అని వ్యాఖ్యానించారు. అందుకే తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల నాని క్వారీలు ఒక్క గంటైనా మూయలేదని చెప్పారు. ఆయన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీని ఆపలేదు. నిబంధనలు పాటించకపోయినా స్టోన్ పాలిషింగ్ పరిశ్రమ జోలికెళ్లలేదని వివరించారు. నిబంధనలు పాటించకపోయినా సంబంధిత శాఖ మంత్రిగా పెద్దిరెడ్డి చర్యలు తీసుకుకోకపోగా, పాతమైనింగ్ కొనసాగిస్తూ అదనంగా మూడు హెక్టార్లు ఇచ్చారని చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. 'మా పార్టీ నేత ఎమ్మార్సీ రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తే మావాళ్లెవరూ ఖండించలేదు కానీ, నాని ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఖండించారు' అని గుర్తుచేశారు. వైసీపీతో ఆయనకు లోపాయికారీ ఒప్పందం ఏస్థాయిలో ఉందో వెల్లడవుతోందని అన్నారు. అదేవిధంగా పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సీఆర్ రాజన్, ఎన్నికల ముందు టీడీపీలో చేరి, నెల రోజులకే చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడి పదవిని పొందారు. మా పెద్దిరెడ్డి సన్నిహితుడికి పార్టీ పగ్గాలు అప్పగించి వైసీపీ నేతపై ఉన్న కృతజ్ఞతను నాని చాటుకున్నారని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో నాని అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 'ఎంతమందిపై దాడిచేస్తారో చేయండి. వడ్డీతోపాటు చెల్లిస్తా..' అని చెవిరెడ్డి హెచ్చరించారు.

చెవిరెడ్డీ.. డైవర్షన్ పాలిటిక్స్ మానుకో..!

- పెద్దిరెడ్డితో మాకు ఎలాంటి సంబంధాలు లేవు
- అవసరమైతే కాణిపాకంలో ప్రమాణం చేస్తా
- నా కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదు
- చెవిరెడ్డిని రాజకీయ సమాధి చేస్తా
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆగ్రహం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి):'మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో మాకు ఎలాంటి లావాదేవీలు లేవు. యాదృచ్ఛికంగా రెండేసార్లు ఎయిర్‌పోర్టులో కలసినప్పుడు పలకరించడం తప్ప. నేను కానీ నా కుటుంబసభ్యులు కానీ ఆయనకు ఫోన్ చేసినా, కలిసి మాట్లాడినట్టు నిరూపించినా కాణిపాకంలో ప్రమాణం చేస్తా. చెవిరెడ్డి..డైవర్షన్ పాలిటిక్స్ మానుకో' అంటూ చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. పులివర్తినానీపై చెవిరెడ్డి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే నాని ఘాటుగా ప్రతిస్పందించారు. 'పెద్దిరెడ్డితో తన భార్య కుటుంబానికి బంధుత్వం ఉన్నమాట వాస్తవమేనంటూ.. ఎర్రావారిపాళెం కరుణాకర్‌రెడ్డి ఇరు కుటుంబాలకు బంధువైనా తమకు వ్యతిరేకంగా పనిచేశారని తెలిపారు. 'మా కార్యకర్తలపై మీరు దాడులు చేశారు. రాజకీయంగా ఎదిగే నాలాంటి వ్యక్తిపై నిందలు వేయద్దు. నిన్ను రాజకీయ సమాధి చేసేవరకు నేను బతికే ఉంటా.' అంటూ తీవ్రస్వరంతో హెచ్చరించారు. 'నేను గెలిచిన తర్వాత శ్రీవారికి మొక్కుబడి తీర్చుకోలేని పరిస్థితి నీవల్లే వచ్చింది. నా ఆరోగ్యం సహకరించక నడిచివెళ్లలేక పోయా. నటించాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ నాకాలు వాపు తగ్గలేదు. నా కార్యకర్తలను వాడు, వీడు అని మాట్లాడితే సహనం కోల్పోవాల్సి వస్తుంది. నా కార్యకర్తలు దేవుళ్లతో సమానం. మీ కార్యకర్తలను కూడా నేను గౌరవిస్తా. ఉన్నది లేనట్టుగా.. లేనిది ఉన్నట్టుగా మాట్లాడవద్దు' అన్నారు. దొంగ ఓట్లు అంశం, తమపై దాడి ఘటనలపై విచారణ జరిపించి తీరుతామని స్పష్టం చేశారు. తన క్వారీలకు రూ.49.5లక్షలు డిమాండు నోటీసు ఇచ్చారని, ఫ్యాక్టరీలకు నోటీసులు ఇచ్చారని, హైకోర్టుకెళ్లి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్నానని నాని వివరించారు. 'పెద్దిరెడ్డి కాదు కదా ఏ రెడ్డి కాళ్లూ నేను పట్టుకోను. కేవీఎస్ పేరుతో బోగస్ ట్రస్టు పెట్టి తప్పుడు లెక్కలు రాసి దోచేస్తున్నావు. కొవిడ్ సమయంలో పంపకాల ముసుగులో మఠం భూములు నొక్కేశావు' అని ఆరోపించారు. 'సీఆర్ రాజన్.. పెద్దిరెడ్డి మనిషని చెబుతున్నావు. మీతో నచ్చకనే ఆయన మా పార్టీలో చేరారు' అన్నారు.



తన కాలు వాపు ఇంకా తగ్గలేదని మీడియాకు చూపుతున్న పులివర్తి నాని

వానరాన్ని కాపాడి..

మానవత్వం చాటుకొని..!



కుక్కల దాడిలో గాయపడిన వానరానికి చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

పలమనేరు, జూలై 19: పలమనేరుకు చెందిన సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు శుక్రవారం కుక్కల బారి నుంచి కాపాడి మానవత్వం చాటుకొన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఉదయం రోడ్డుపైకి వచ్చిన ఒక వానరాన్ని వీధికుక్కలు చుట్టుముట్టాయి. సమీపంలోనే అటుగా వెళ్తున్న మధుమోహన్‌రావు ఆ వీధికుక్కలను తరిమివేశారు. అప్పటికే వీధికుక్కలు వానరాన్ని కరిచి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే ఆయన గాయపడిన వానరాన్ని తన ఇంటికి తీసుకు వెళ్లి వానరానికి కొంత ఆహారాన్ని అందించారు. అనంతరం పశువైద్యశాలకు వెళ్లి అక్కడి సిబ్బందికి విషయాన్ని వివరించారు. వారిని వెంటబెట్టుకుని, మందులను తీసుకొచ్చి వానరానికి చికిత్స చేయించారు.

జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్, డీఎంపీసీ ఛైర్మన్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.1,250 చెల్లించి 2025 మార్చి 31వ తేదీ వరకు లబ్ధి పొందాలని కోరారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్‌స్కీమ్ దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో పనివేళల్లో అందజేయాలని కోరారు. హెల్త్ స్కీము ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులూ లేవని, ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 19: పేద విద్యార్థులకు దాతల సాయం శ్లాఘనీయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ కళ్యాణిల ఆధ్వర్యంలో అభయం ట్రస్టు ద్వారా విద్యా సామగ్రిని ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈశ్వర్‌నాయుడు మాట్లాడుతూ ఏడేళ్లుగా తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణి, జనార్దన్ గౌడ్, మోహన్ నాయుడు, ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతాం

చిత్తూరు సిటీ, జూలై19: జిల్లాను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి జిల్లాలో చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు కావాల్సిన మార్గాలను అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ తెలిపారు.

సౌకర్యాలెలా ఉన్నాయ్?

శ్రీవారి భక్తులతో ముచ్చటించిన హోంమంత్రి అనిత



తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సౌకర్యాలెలా ఉన్నాయంటూ తిరుమలలో శ్రీవారి భక్తులతో హోంమంత్రి అనిత ముచ్చటించారు. కాలినడకన శుక్రవారం తిరుమలకు చేరుకున్న ఆమె క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేశారు. ఈసందర్భంగా అక్కడున్న భక్తులను పలుకరించారు. ఎక్కడి నుంచి వచ్చారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ కొంతసేపు వారితో మాట్లాడారు.

వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా జేవీ రమణ



తిరుపతి రూరల్, జూలై19: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఈమేరకు పేర్కొన్నారు. 1991లో అఖిల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలిలో సైంటిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన రమణ.. 2001లో వెటర్నరీ వర్సిటీలో యానిమల్ న్యూట్రిషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2007లో ప్రొఫెసర్‌గా, 2016 నుంచి ఐదేళ్లపాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేశారు. 2022 అక్టోబరు నుంచి రెండో దఫా డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్‌గా నియమితులై కొనసాగుతున్నారు. వీసీగా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

లేబర్ డీసీ బాలు నాయక్‌కు జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి



తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.బాలు నాయక్‌కు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు డిప్యూటీ కమిషనర్లకు పదోన్నతి లభించగా వారిలో బాలు నాయక్ కూడా ఉన్నారు. పదోన్నతిపై ఆయన్ను ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా కర్నూలుకు బదిలీ చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కొక్కరిది ఒక్కో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఎస్టీకాలనీకి చెందిన ముగ్గురి దుర్మరణం



జయచంద్ర మృతదేహం వద్ద కుటుంబీకులు

ఐరాల, జూలై 19: ఒకే కాలనీకి చెందిన ముగ్గురు గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ ఘటనతో ఎస్టీకాలనీలో విషాదం నెలకొంది. ముగ్గురి కుటుంబాలవీ ఒక్కో విషాదం. మృతులు.. ఐరాల మండలం వేదగిరివారిపల్లె పంచాయతీ రామతీర్థ సేవాశ్రమం ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్ర(38), నారాయణ(35), నాగేంద్ర(14). రోడ్డు ప్రమాదం జరిగింది.. తిరుపతి జిల్లా పాకాల మండలం సప్తకనికలమ్మ ఆలయం వద్ద. ఎస్టీ కాలనీకి చెందిన ఈ ముగ్గురు సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో దామలచెరువుకు వెళ్తుండగా అక్కగార్ల ఆలయం వద్ద అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా మనోజ్ గాయపడ్డాడు. స్థానికులు మనోజ్‌ను 108 ద్వారా కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులకు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ పెద్దల మృతితో ఆ కుటుంబాలు దిక్కులేనివయ్యాయి. జయచంద్రకు ఐదుగురు పిల్లలు. ఇందులో ఒకరు మృతి చెందగా ప్రస్తుతం అతని భార్య గర్భిణి. కూలికి వెళితే గాని పూటగడవని స్థితి. జయచంద్ర మృతితో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నారాయణకు ఇద్దరు పిల్లలున్నారు. నాగేంద్రకు ఇంకా పెళ్లి కాలేదు. చేతికి అందిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

కల్లూరులో గట్టి బందోబస్తు

- ఎంపీ మిథున్‌రెడ్డి సదుం వెళ్తుండటంతో పోలీసుల ముందు జాగ్రత్త చర్యలు



కల్లూరు, జూలై 19: పులిచెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో శుక్రవారం అడిషనల్ ఎస్పీ ఆరీఫుల్లా ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఎంపీ మిథున్‌రెడ్డి కల్లూరు మీదుగా సదుం బయలుదేరారు. గురువారంనాటి పుంగనూరు ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కల్లూరు నాలుగురోడ్ల కూడలికి చేరుకున్నారు. టీడీపీ శ్రేణులు రోడ్లపైకి వచ్చి నిరసన చేపట్టకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పోలీసులు ఉదయం 8 గంటలకే కల్లూరు నాలుగురోడ్ల కూడలిపైకి పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఏమి జరుగుతోందో అర్థంకాక ప్రజలు ఒక్క సారిగా ఆందోళన చెందారు. అయితే ఎంపీ మిథున్‌రెడ్డి ఉదయం 11.13 గంటలకు కల్లూరు మీదుగా సదుం వెళ్లడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ బందోబస్తులో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, కుళ్లాయప్ప, విశ్వనాధరెడ్డి, ఎస్‌ఐలు రవిప్రకాష్‌రెడ్డి, రమేష్, ఉమామహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన

కుప్పం, జూలై 19: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటన ఖరారైంది. ఈనెల 23 నుంచి నాలుగురోజులపాటు ఆమె కుప్పంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు ప్రతాప్, శాంతారాం తదితరులు ఆమె పర్యటన షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. 23వ తేది మధ్యాహ్నం గుడుపల్లె మండలం కమ్మగుట్టపల్లె చేరుకుని మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కంచిబందార్లపల్లెలోనూ గ్రామీణ మహిళలతో సమావేశమై వారి సాదకబాధకాలు తెలుసుకుంటారు. గుట్టపల్లె, కోటపల్లె గ్రామాలలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. రాత్రికి పీఈఎస్ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. 24న ఉదయం కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కుప్పం మండలం ఎన్.కొత్తపల్లె, నడిమూరు, పైపాళ్యం, ఉర్లవోబనపల్లె, గుడ్లనాయనిపల్లె గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాలలో మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారు. సాయంత్రం కుప్పం చేరుకుని టీడీపీ నాయకులు, కో-ఆర్డినేటింగ్ కమిటీతో సమావేశమవుతారు. 25వ తేది ఉదయం శాంతిపురం మండలం సోమాపురం, కర్లగట్ట, బడుగుమాకులపల్లె, రామకుప్పం మండలం ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరిమానుపెంట, వీర్నమల గ్రామాలను సందర్శించి అక్కడి మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. 26న శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం వద్ద తమ సొంతింటి నిర్మాణాన్ని పరిశీలిస్తారు. అనంతరం పీఈఎస్ ఆడిటోరియంలో 10.30 గంటలకు మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీలో పాల్గొంటారు.

వైసీపీ నేత ఇసుక డంప్ సీజ్






పోలీసులు సీజ్ చేసిన ఇసుక డంపు, పోలీస్ స్టేషన్ వద్ద ట్రాక్టరు

శాంతిపురం, జులై 19: వైసీపీ నేత అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ శుక్రవారం సీజ్ చేశారు. శాంతిపురం మండలం నాయనపల్లెకు చెందిన వైసీపీ నేత కృష్ణమూర్తి 70 లోడ్ల ఇసుకను గ్రామ సమీపంలోని నర్సరీ వద్ద నిల్వ చేశారు. ఈ ఇసుకను వేరేచోటుకు తరలిస్తుండగా తన సిబ్బందితో వెళ్లి ఎస్ఐ సీజ్ చేశారు. ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇసుకను తహసీల్దార్ మురళీకృష్ణకు అప్పగించారు. కృష్ణమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జయప్ప, వీఆర్వో రాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లో ఇసుక డంప్‌లు

పలమనేరు, జూలై19 : పలమనేరు మండలం పెంగరగుంట, ముసలిమడుగు గ్రామాలకు చెందిన పొలాల్లో వారం రోజుల వ్యవధిలో పలుచోట్ల ఇసుక డంప్‌లు కనిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన ఎస్ఈబీ అధికారులు, రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





పెంగరగుంట, ముసలిమడుగు వద్ద నిల్వచేసిన ఇసుక

నాసిరకంగా భవన నిర్మాణాలా..?

● మట్టితో కలసిన ఇసుకతో ఎలా చేపడతారంటూ ప్రశ్న ● లోపభూయిష్టంగా ఉన్న మెడికల్ కాలేజి భవనాలపై ఎమ్మెల్యే ఆగ్రహం


వంకర తిరిగిన బీమ్‌లను ఇంజినీరింగ్ అధికారులకు చూపిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 19: వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్ కాలేజి భవనాల నిర్మాణాలు లోపభూయిష్టంగా నాసిరకంగా ఉండడంపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆరోగ్యవరం సమీపంలో ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజి భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే పలు చోట్ల పిల్లర్లకు అనుసంధానంగా నిర్మించిన బీమ్‌లు వంకర టింకరగా కొలతలు లేకుండా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు. అంతే కాకుండా పిల్లర్లు పలుచోట్ల కొలతలు లేకుండా ఇష్టారాజ్యంగా ఉండడం, భవనాల గోడల నిర్మాణానికి ఉపయోగిస్తున్న సిమెంట్ ఇటుకలు నాసిరకంగా ఉండటంతో ఎమ్మెల్యే విస్మయం వ్యక్తం చేశారు. ఇదిలా వుండగా మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణం కోసం సేకరించిన వేలాది టన్నుల ఇసుక మట్టితో కలసి ఉండటంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో హరీష్ అనే ఇసుక కాంట్రాక్టర్ వేలాది ట్రిప్పర్ల నాసిరకం ఇసుకను ఈ భవనాల కోసం సరఫరా చేశాడని, సగం మట్టి, సగం ఇసుక ఉండటం ఏంటని ప్రశ్నించారు. అసలు క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో పాటు ఏపీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డికి ఫోన్ చేసి మెడికల్ కాలేజీ భవన నిర్మాణంలో జరుగుతున్న నాసిరకం పనులపై ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలపై వెంటనే క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పరిశీలించి నివేదికలను ఇవ్వాలన్నారు. ఈ నివేదికలను సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు పంపుతామని వారి నిర్ణయం మేరకు చర్యలు ఉంటాయన్నారు. రెండేళ్లుగా జరుగుతున్న ఈ నిర్మాణాల వద్దకు బయట వ్యక్తులను వెళ్లనీయకుండా చెక్‌పోస్టు పెట్టి అడ్డుకోవడంలో మర్మమేంటని ప్రశ్నించారు. ఇక్కడ జరుగుతున్న లోపాలు బయట ప్రపంచానికి తెలియనీయకుండా వైసీపీ పాలకులు ఆనాడు అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ అరవిందదేవి, డీఈ కరీముల్లా, టీడీపీ నాయకులు షంషీర్, గంగారపు రామ్మూర్తినాయుడు, బాలుస్వామి, చిన్న మహేష్, పోతబోలు సుధాకర్, వెంకటేశ్, సీటీఎం మాజీ సర్పంచ్‌లు రెడ్డిరామ్ ప్రసాద్, పారపట్ల ప్రభాకర్‌రెడ్డి, సి.నరసింహులు, బీజేపీ నాయకులు ఓసూరి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని హత్యచేసిన తనయుడి అరెస్టు


హత్య కేసులో నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, టూటౌన్ సీఐ యువరాజు

మదనపల్లె అర్బన్, జూలై19:తండ్రిని హత్య చేసిన తనయుడు రఘునాథరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మీడియా సమావేశంలో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, రామాలయ వీధికి చెందిన నీరుగట్టి చిన్నరెడ్డెప్పను స్వంత పెద్దకుమారుడైన నీరుగట్టి రఘునాథరెడ్డి బుధవారం (17వతేదీ) రాత్రి కారుతో ఢీకొట్టి హత్య చేసిన విషయం తెలిసిందేనన్నారు. చిన్నకుమారుడు నీరుగట్టి శంకర్‌రెడ్డి బెంగళూరులో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తుండగా, పెద్ద కుమారుడు కురుబలకోట మండలం, అంగళ్లులో బాడుగ ఇంట్లో నివాసం ఉంటూ గతంలో ఓ ప్రైవేట్ కళాశాల్లో అధ్యాపకుడుగా పని చేసి నిలిపి వేశారు. తరువాత స్టార్ మార్కెట్‌లో షేర్స్ కొనడం, అమ్మడం చేసేవాడు. ఇందులో నష్టం రావడంతో తన వద్ద ఉన్న బంగారును రూ.16 లక్షలకు లోన్‌పెట్టి తిరిగి తీసుకోలేకపోయాడు, ఈ క్రమంలో తమకు ఉన్న ఆస్తిని పంచి ఇవ్వాలని తండ్రి నీరుగట్టి చిన్నరెడ్డెప్పరెడ్డిపై ఒత్తిడి చేసేవాడని, ఆస్తిని పంచి ఇవ్వకుండా, తనకు ఆర్థిక సాయం చేయకుండా తనను కొట్టి ఇంట్లో నుంచి తరిమి వేయడంతో తండ్రిపై రఘునాథరెడ్డి కక్ష పెంచుకున్నాడన్నారు. చిన్నరెడ్డెప్పరెడ్డి భార్య చంద్రకళ గత ఆరేళ్లుగా చిన్నకుమారుడి శంకర్‌రెడ్డి వద్ద ఉంటుంది. రఘునాథరెడ్డి పలుమార్లు తన ఆర్థిక పరిస్థితి సరిలేదని ఆస్తి ఇవ్వాలని తండ్రితో గొడవ పడేవాడు. ఇదే క్రమంలో 17వ తేదీన అలవాటుగా వాకింగ్ వెళుతున్న రఘునాథరెడ్డిని రాత్రి 8 గంటల సమయంలో గ్రీన్ మ్యాట్ మైదానంలో కలిసి ఆస్తిని పంచి ఇవ్వాలని గొడవ పడ్డాడు. ఇందుకు చిన్నరెడ్డెప్పరెడ్డి నిరాకరించడంతో తనతో తెచ్చుకున్న కారుతో ఢీకొట్టి చంపేసి విషయం తన తమ్ముడు శంకర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడన్నారు. వెంటనే శంకర్‌రెడ్డి పోలీసులకు విషయం తెలపడంతో 18వ తేదీన ఉదయం 5 గంటలకు మృతదేహాన్ని గుర్తించి జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. చిన్నకుమారుడు శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు మదనపల్లె డీఎస్పీ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ యువరాజు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య సిబ్బందితో కలిసి వెళ్లి నిందితుడు నీరుగట్టి రఘునాథరెడ్డిని శుక్రవారం ఉదయం మదనపల్లె టౌన్ అన్నమయ్య సర్కిల్‌వద్ద అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన కారును సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

తండ్రిని హత్య చేసిన తనయుడిని కఠినంగా శిక్షించాలి

మదన పల్లె అర్బన్, జూలై 19: స్థానిక నీరుగట్టువారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్పరెడ్డిని హత్య చేసిన తనయుడు రఘునాథరెడ్డిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్తి పంచలేదని కోపంతో వయోవృద్ధుడైన చిన్నరెడ్డెప్పరెడ్డి (65)ని కారుతో ఢీ కొట్టి హత్య చేయడం దారుణమన్నారు. ఇలాంటి వారికి కఠినంగా శిక్ష వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్‌సాహెబ్, గౌరవాధ్యక్షుడు మునిరత్నమయ్య, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్, కృష్ణమూర్తి, ప్రొఫెసర్ శ్రీనివాసులు ప్రభాకర్‌మూర్తి, శాంతమ్మ, ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఆనందరెడ్డి (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, జూలై 19: అప్పుల బాధతో ఉరివేసుకుని ఆర్. ఆనందరెడ్డి (35)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం బీకేపల్లె, వైఎస్సార్ కాలనీకి చెందిన ఆనందరెడ్డి అప్పుల బాధ భరించలేక గురువారం రాత్రి ఇంట్లో లుంగీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను మదనపల్లె పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో మేనేజరుగా పని చేస్తు న్నాడు. గతంలో ఓ ప్రైవేటు బ్యాంకులో సేల్స్ విభాగంలో పని చేస్తున్న సమయంలో ఆనం దరెడ్డి రూ. 20 లక్షలు అప్పులు చేశాడని, అప్పుల ఇచ్చిన వారు ఒత్తిడి తేవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డా డన్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ ఇనాయతుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు అదృశ్యం

మదనపల్లె అర్బన్, జూలై19: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ వెంకటసుబ్బయ్య తెలిపా రు. పోలీసుల కథనం మేరకు స్థానిక పట్టణం, ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన వి.రాఘవేంద్రాచారి(40) గత నెల 24వ తేదీనుంచి కనపడడం లేదని తెలి పారు. ఇతను యాసిడ్, ఫినాయల్ వ్యాపా రం నిర్వహించేవాడని, వ్యాపారం కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని చెప్పారు. దీంతో భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అగ్నిప్రమాదంలో వస్తువులు దగ్ధం



కలకడ, జూలై 19:మండలంలోని బాటవారిపల్లె పంచాయ తీ కూచివారిపల్లెకు చెందిన పద్మావతమ్మ ఇంటిలో శుక్ర వారం అగ్ని ప్రమాదం జరిగి ఇంటిలోని వస్తువులు దగ్ధమయ్యాయి. బాధితురాలి వివరాల మేరకు పొలం వద్ద పశువులు మేపుతుండగా ఇంటిలో మంటలు వస్తునట్లు గ్రామస్థులు సమాచారమిచ్చారు. విషయాన్ని పీలేరు అగ్నిమాపక సిబ్బందికి తెలుపుగా వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంటిలోని ఫ్రిజ్, టీవీ, మంచా లు, దుస్తులు, వస్తుసామాగ్రి బుడిదైనట్లు తెలిపారు. విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని బాధితురాలు వాపోయారు. భారీగా ఆస్తినష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రోడ్డుభద్రతా నిబంధనలు పాటించాలి

నిమ్మనపల్లి, జూలై 19: మండలంలోని ఆటో, మినీబస్సు డ్రైవర్లు రోడ్డుభద్రతా నిబంధనలు తప్పకుండా పాటించాలని లేకపోతే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ లోకేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆటో, మినీబస్సు డ్రైవర్లకు స్థానిక బస్టాండులో రోడ్డుభద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, మాదకద్రవ్యాలు తరలించడంతో పాటు సారా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అంతే కాకుండా డ్రైవర్లకు లైసెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్ వంటి సర్టిఫికెట్‌లు ఖచ్చితంగా ఉండాలన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేషపూజలు

మదనపల్లె అర్బన్, జూలై19: స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఉపాధ్యాయుడు రాడు.. పాఠశాల తెరవరు


వాల్మీకిపురం మండలంలోని ఆరమడక గ్రామంలో ఉపాధ్యాయుడు లేక పాఠశాల బయట ఉన్న విద్యార్థులు

వాల్మీకిపురం, జూలై 19: వాల్మీకిపురం మండలంలోని ఆరమడక గ్రామంలో ఉపాధ్యాయుడు రాక పాఠశాల తెరుచుకోవడంలేదు. దీంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చి ఇంటికి వెళ్లిపోవడం పరిపాటైంది. గత తొమ్మిది రోజులుగా ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవడంతో పిల్లలు పాఠశాల ఎదుట వేచి చూడటం.. తిరిగి ఇంటికి వెళ్లిపోవడం కొనసాగుతుండటంతో పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇదే పాఠశాలకు ఓ ఉపాధ్యాయుడిని నియమిస్తూ మండల విద్యాశాఖాధికారి వెంకటరత్నం ఉత్తర్వులు ఇచ్చారు. అయితే సదరు ఉపాధ్యాయుడు మాత్రం తాను వాల్మీకిపురం పట్టణంలోనే పని చేస్తానని ఆరమడక పాఠశాలకు వెళ్లనని భీష్మించుకుకోవడంతో ఆ పాఠశాలకు ఉపాధ్యాయుడు మాత్రం లేడు. ఈ విషయమై ఎంఈవో వెంకటరత్నంను వివరణ కోరగా ఆరమడక పాఠశాలకు ఈనెల 9వ తేదీనే ఉపాధ్యాయుడిని నియమించాయమన్నారు. సదరు ఉపాధ్యాయుడు విధులకు వెళ్లకపోగా వాల్మీకిపురం టౌన్‌లోనే ఉన్నట్లు చెప్పారు.

సంఘమిత్రల పనితీరుపై పీడీ అసంతృప్తి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

రామసముద్రం, జూలై 19: మండలంలోని వెలుగు సమాఖ్యలో పని చేస్తున్న సంఘమిత్రల పనితీరుపై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వెలుగు సమాఖ్య సీసీలు, వీవోల రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలుగు సమాఖ్యకు పునాది సీఐఎఫ్ అని దీని ద్వారా తీసుకున్న రుణాలు రికవరీ చేయడంలో కురిజల సంఘమిత్రలు నిర్లక్ష్యం చూపడంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్యాన్ని నీరుగార్చే విధంగా పనితీరు ఉంటే అలాంటి వారిని సంఘం నుంచి తొలగిస్తామని పీడీ హెచ్చరించారు. సంఘాల ఆర్థిక లావాదేవీ వివరాలు ఎప్పటికప్పుడు లోకోస్‌లో ఆన్‌లైన్ చేయాలని, వీటిలో ఏదైనా దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య పెన్షన్ అధికారి ధర్మరాజు, ఉన్నతి పథకం పరిశీలకులు వెంకటరమణ, డీపీఎం గంగరాజు, ఏపీఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


పక్కా గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెద్దమండ్యం, జూలై 19: మండలంలో పక్కాగృహా నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కలిచెర్లలో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎంపీడీవో మాట్లాడుతూ కలిచెర్లలో వివిద దశల్లో ఉన్న పక్కా గృహాల నిర్మాణాలను సకాలం పూర్తి చేయాలన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో సకాలంలో బిల్లులు చెల్లింపులు జరుతుందన్నారు. గృహ నిర్మాణాలు జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దశల వారిగా మండలంలో జీఎస్ ఇంజనీరు అసిస్టెంట్‌లు పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌బాషా, జీఎస్ ఇంజనీర్ అసిస్టెంట్ బాలాజీనాయక్ పాల్గొన్నారు. .

అమరరాజ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, జూలై 19:అమరరాజ గ్రూపు కంపెనీల ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం సుభాష్‌రోడ్డులోని ఆయన నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 21న స్థానిక ఎన్‌వీఆర్ కళ్యాణమండపంలో అమరరాజ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్ ఉత్తీర్ణులైన వారు, ఐటీఐ, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు వుండాలని, వారి సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డులు తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, షంషీర్, ఆర్టిస్ట్ వేణు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, సహదేవినాయుడు, ఎస్ఎం రఫి, సంగం హరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో శిక్షణ

మదనపల్లె అర్బన్, జూలై 19: ప్రపంచంలో అత్యుత్తమ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలలో ఒకటైనా ఎల్‌వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ కో- ఆర్డినేటర్ జె. శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్ పాసై 18-23 ఏళ్ల వయస్సు కలిగి, అవివాహితులైన మగ, ఆడ వారు ఎవ్వరైనా అర్హులని చెప్పారు. మదనపల్లె మండలం, బెంగళూరు రోడ్డులోని వీసీ ఫారెక్ ఐ సెంటర్‌లో ఈనెల 26 మధ్యాహ్నం 3 గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరెన్ని వివరాలకు 9666517635, 9705751330 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.


విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానం

పెద్దతిప్పసముద్రం జూలై 19 : మండలంలోని బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు బి.కొత్తకోట లోని ఎన్‌సీసీ యూనిట్ 5(ఎ) బాలికల బెటాలియన్ విభాగంలో శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్నట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ రాజేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాస్కర్‌లు తెలిపారు. బూర్లపల్లె పాఠశాల నుంచి 22 మంది విద్యార్థినులు ఎన్‌సీసీలో శిక్షణ పొందుతూ ఇటీవల ఎన్‌సీసీ పరీక్షల్లో పాల్గొని అర్హత సాదించి సర్టిఫికెట్లను పొందారన్నారు. ఈ విద్యా సంవత్సరానికి 53 మంది విద్యార్థినులను ఎంపిక చేసుకుని వారికి ఎన్‌సీసీలో శిక్షణ అందిస్తున్నట్లు వారు తెలియచేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలి

కలకడ, జూలై 19:వర్షాకాలంలో ప్రజలు రోగాల భారీనపడకుండా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయితీ కార్యదర్శులు సర్పంచుల సహకారంతో పైప్‌లైన్ లీకేజీ ఉన్న చోట మరమ్మతులు చేయించడంతోపాటు ట్యాంకులను 15 రోజులకు ఓ సారి శుభ్రం చేయించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. బాలయ్యగారిపల్లె సర్పంచ్ విశ్వనాథ్ మాట్లాడుతూ బాలయ్యగారిపల్లె కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటే హౌసింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదే విధంగా బాలయ్యగారిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు ఏడాదిగా మండల సమావేశాలకు హాజరుకాకపోవడంపై ఎలాంటి చర్యలు తీసుకొన్నారని ఎంపీడీవోను కోరగా సదరు ఎంపీటీసీకి ఇప్పటికే నోటీసులు జారీ చేసి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ లతీఫ్‌ఖాన్, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రికి క్షమాపణ చెప్పేదాకా సమావేశం వద్దు


ఎంపీడీవోతో వాయిదా వేయాలని కోరుతున్న టీడీపీ నేతలు

కురబలకోట, జూలై 19: రాష్ట్ర విద్యాశాఖామంత్రినారా లోకేశ్‌పై గతంలో దూషణలు చేసిన మండల ప్రజాప్రతినిధులు క్షమాపణ చెప్పేదాక సమావేశం నిర్వహించడానికి వీల్లేదని టీడీపీ నేతలు ఎంపీడీవోని కోరారు. ఈ నెల 12న మండల సమావేశం సభ్యులు హాజరు కాకపోవడంతో 19కి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సమావేశానికి మళ్లీ ఆటంకాలు ఎదురయ్యాయి. టీడీపీ నేతలు హాజరై తమ నేత నారాలోకేశ్ యువగళం పాదయాత్రలో ఉండగా ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, దానికి వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ, జడ్పీటీసీలు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

ఆర్మీ జవాన్‌కు ఘనంగా అంతిమ వీడ్కోలు


ఆర్మీ జవాన్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కురబలకోట, జూలై 19: అనారోగ్యంతో మృతి చెందిన ఆర్మీ జవాన్‌కు శుక్రవారం అంతిమ ఘనంగా అంతిమ వీడ్కోలు పలికారు. మండలంలోని కురబలకోట పంచాయతీ పగడాలవారిపల్లెకు చెందిన రాజన్న కుమారుడు వెంకటేష్(30) ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 27న కిడ్నీ వ్యాధి కారణంగా అస్వస్థతకు గురై జోధ్‌పూర్ మిలటరీ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబీకులకు ఆర్మీ ఉద్యోగులు తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని ఆర్మీ ఉద్యోగులు బెంగళూరుకు తరలించి అక్కడి నుంచి రోడ్డు మార్గాని స్వగ్రామానికి తరలిస్తున్న సందర్భంగా యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌరవలాంఛనాలతో ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

చికెన్ వ్యర్థాలపై చర్యలు తీసుకోండి

గుర్రంకొండ, జూలై 19:గుర్రంకొండ పట్టణంలో జాతీయ రహదారి పక్కన చికెన్ వ్యర్థాలు వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని వాటిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. గుర్రంకొండ పట్టణంలోని ఇందిరమ్మకాలనీ సమీపంలోని సచివాలయం ఎదురుగా, అలాగే ఏనుగులచెరువు కట్ట మీద చికెన్ వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేస్తున్నారన్నారు. రోడ్డు పక్కన్న వేస్తున్న చికెన్ వ్యర్థాలను తొలగించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రామాంజులు, భరత్, కిశోర్, రెడ్డిరాజా, బాబు, రామాంజిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


రెడ్డిసాహెబ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఎస్‌కే బాషా

మదనపల్లె అర్బన్, జూలై19: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా మాట్లాడుతూ భవిష్యత్‌లో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరారు. కేక్‌కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. నియోజకవర్గ నాయకులు, కార్యర్తలు రెడ్డిసాహెబ్‌కు పూలమాలలు వేసి దుశ్శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌పీర్, మహమ్మద్, మీనాకుమారి, ఈశ్వరమ్మ, సయ్యద్, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ములకలచెరువు, జూలై 19: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నజీర్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నాయక్, సిబ్బంది మహేష్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది

రామసముద్రం, జూలై 19: తెలుగుదేశం పార్టీకి కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నట్లు రాజంపేట పార్లమెంట్ కోశాధికారి సీతప్ప తెలిపారు. రామసముద్రం మండలం గజ్జలవారిపల్లెకు చెందిన సీతప్ప టీడీపీలో సీనియర్ నాయకుడు. అమరావతిలో శుక్రవారం మంత్రి లోకేశ్, సవితమ్మలతో సీతప్ప కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న రాజకీయ, సమస్యలపై వారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

బాలికల పాఠశాలల్లో జేసీ ఆకస్మిక తనిఖీలు


పాఠశాలలోని సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకుంటున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

కలికిరి, జూలై 19: కలికిరి, మర్రికుంటపల్లె సచివాలయాలతోపాటు కలికిరి లోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సచివాలయాలు, పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. పాఠశాలలోని 194 మందికిగాను 150 మందికి మాత్రమే ఇస్కాన్ భోజనం సరఫరా అవుతుండడంపై హెచ్ఎం జయమ్మను ప్రశ్నించారు. ఇండెంట్ సరిగ్గా పెట్టి విద్యార్థినులందరికీ మధ్యాహ్న భోజనం అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అయితే ఇస్కాన్ భోజనం సరిగ్గా ఉండడం లేదని అటు హెచ్ఎం, ఇటు విద్యార్థినులు జేసీకి తెలిపారు. లిఖితపూర్వకంగా ఇస్కాన్ ప్రతినిధులకు సమాచారం అందజేసి సమస్యను పరిష్కరించాలని జేసీ మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ కూడా మధ్యాహ్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గది, మెనూ బోర్డును పరిశీలిం చారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయాలను సందర్శించి ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయకుమారి, ఎంపీడీవో రామకృష్ణ య్య, ఎంఈవోలు కరీముల్లా, నాగార్జున, ఈవోపీఆర్ఆర్డీ పరశురాం, ఈవో గురుమోహ న్, సీఆర్‌పీ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పీవోపీ వినాయక విగ్రహాలపై నిషేధం : ఆర్డీవో

● మట్టి విగ్రహాలతో పండుగ జరుపుకోవాలి


పీవోపీ విగ్రహాల నిషేధంపై అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, జూలై 19: పీవోపీ రసాయనాలతో తయారు చేసే వినాయకుడి విగ్రహాలతో పర్యావర ణానికి తీవ్రంగా హాని ఉన్నందున వాటిని నిషేధించినట్లు ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, విద్యాశాఖ అధికారులతో ఆర్డీ వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే వినాయకుడి విగ్రహాల్లో జిప్సం, గంధకం, మెగ్నీ షియం వంటి హానికర రసాయనాలు భూమిలో కలసి పోయి భూగర్భ జలాలు అడుగం టే ప్రమాదం ఉందన్నారు. అలాగే విగ్రహాలకు వేసే కృత్రిమ రంగుల్లో కాడ్మియం, పాద రసం, తగరం, కార్బన్ వంటి రసాయనాలతో జలవనరులు కలుషితం అవుతున్నాయ న్నారు. దీనిపై ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఉత్తర్వులతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పీవోపీ విగ్ర హాల తయారీని అడ్డుకోవాలని ఇప్పటికే తయారైన విగ్రహాలను విక్రయిం చకుండా తయారీదారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. మట్టి విగ్రహాల తయారీపై విద్యా ర్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టరేట్ డీఏవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, వన్ టౌన్, తాలూకా సీఐలు వలీబషు, శేఖర్, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

మట్టితోనే విగ్రహాలను తయారు చేయాలి

ములకలచెరువు, జూలై 19: పర్యా వరణ పరిరక్షణ కోసం రానున్న వినాయక చవితి వేడుకల్లో ఏర్పాటు చేసుకునేందుకు వినాయక విగ్రహాలను మట్టితోనే తయారు చేసేలా చూడాలని మదనపల్లె ఆర్డీవో హరి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ములకలచెరువు తహసీల్దార్ కార్యాల యాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వినాయక చవితికి పీవోపీతో చేసిన వినాయకుడి విగ్రహాలు అమ్మకాలు చేయరాదన్నారు. మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలు ఉంటేనే అనుమతి ఇస్తామ న్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనీల్‌కుమార్, ఎంఈవో వెంకటరమణ, ఎస్ఐ తిప్పేస్వామి, ఆర్ఐ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: వినాయక చవితి పండుగ రోజున ఉత్సవా లకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేలా ప్రజలను ప్రోత్సహించాలని రెవె న్యూ సిబ్బందికి తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో పర్యావరణ పరిరక్షణపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు రసాయనాలతో విగ్రహాలను తయారు చేయ కుండా ఉత్సవ కమిటీ సభ్యులు తమ వంతు కృషి చేసేలా చూడాలన్నారు. రసాయనా లతో కలిసిన విగ్రహాలు వాడితే కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ నాగరాజు, ఎంఈవో హేమలత, ఎంఈవో 2 ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, రెహ్మాన్, జగదీష్ పాల్గొన్నారు.

'ఉద్యోగులతో చర్చించి ఐఆర్ ప్రకటించండి'

ములకలచెరువు, జూలై 19: ఉద్యోగ, ఉపా ధ్యాయుల ఆశలకు అనుగుణంగా ఏర్పడిన నూతన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపా ధ్యాయ సంఘాలతో చర్చించి ఐఆర్‌ను ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూధన డిమాండ్ చేశారు. ములకలచెరువులో శుక్రవారం ఉపాధ్యాయలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలస్యం, అలసత్వం లేకుండా 12వ పీఆర్సీకి సంబంధించిన ఐఆర్‌ను ప్రకటిం చాలన్నారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజా రెడ్డి, జిల్లా నాయకులు రామకృష్ణ, అమరనాథరెడ్డి, మండల నాయకులు వెంకటరమణ, సబ్బరాయప్ప, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘ సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసులు

పెద్దతిప్పసముద్రం జూలై 19 : పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలకు చెందిన గొర్రెలు, మేకలు రైతు ఉత్పత్తి దా రుల సంఘం ఉత్పత్తి సహాయక సహకార సంఘ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వెలుగు ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పీటీఎంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సంఘ సభ్యుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘాల నుంచి తీసుకున్న దీర్ఘ కాలిక రుణాలను రికవరీ చేసేందుకు ఓ ప్రత్యేక కమిటీని నియమించి సంఘాలను బలోపేతం చేయనున్నామన్నారు. దీనికి సంఘంలో ఉన్న ప్రతి సభ్యులు సహకరించాలని ఆయన కోరారు. దీర్ఘకాలిక రుణాలు సుమారు రూ. 26 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఎంజీ మల్లయ్య, వెలుగు సిబ్బంది, ఎఫ్‌పీవో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పీలేరు, జూలై 19: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పనిచేసే సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తతో మెలగాలని ఏపీ ట్రాన్స్‌కో ట్రాన్స్‌ఫార్మర్స్ విభాగం డీఈఈ బాబు పేర్కొన్నారు. పీలే రు డివిజన్ పరిధిలోని పీలేరు, కేవీపల్లె, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, చిన్నగొ ట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న సిబ్బందికి శుక్రవారం పీలేరులో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లలోని హెవీ ట్రాన్స్‌ఫార్మర్ల పని విధానంపై సంపూర్ణ అవగాహన చేసుకోవాలని సిబ్బందికి సూ చించారు. కార్యక్రమంలో డీఈఈలు సుధాకర్, శివయ్య, శ్రీనివాసులు, ఏఈలు వెంకట పురుషోత్తం, రామ్మూర్తి, జ్యోతిప్రసాద్, రెహ్మాన్, వాసు, అజయ్‌బాబు, సురేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై తనిఖీ

రామసముద్రం, జూలై 19: మండలంలోని ఉపాధి హామీ పథకం కింద జరిగిన వివిధ పనులు, వాటి ఖర్చులపై పీవో మద్దిలేటి ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మొత్తం 1620 పనులకు గాను రూ.5.92కోట్లు ఖర్చు చేసినట్లు పీవో తెలి పారు. అలాగే పండ్ల తోటల పెంపకంలో చెట్లు చనిపోయిన వాటిలో రూ. 68547 లబ్ధిదారుల నుంచి, ఉపాధి హామీ సిబ్బంది నుంచి రూ.38942, పంచాయతీ రాజ్ నుంచి రూ.6875 మొత్తం రూ.114364 రికవరీ చేసినట్లు పీవో చెప్పారు. అసిస్టెంట్ విజి లెన్స్ అధికారి ప్రకాష్, ఎంపీడీవో భానుప్రసాద్, ఎంపీపీ కుసుమకుమారి, ఏపీవో పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

మదనపల్లె టౌన్, జూలై 19: ఎల్ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డివిజన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చెక్కా రామ్మోహన్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా జీవీ రమణారెడ్డి, కోశాధికారిగా ఎస్.మస్తాన్, గౌరవాధ్యక్షుడుగా సి.రాజారెడ్డి, కార్యవర్గ సభ్యులను అభినందించారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ, జూలై 19:ఆరోగ్య కేంద్రాల ద్వారా అందే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పాపిరెడ్డిగారిపల్లె విద్యార్థులు, గ్రామస్థులకు వివిధ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అర్హులైన వారు బీసీజీ టీకాను వేయించుకోవాలన్నారు.